for e-paper scan now

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక
teenmaardesk@gmail.com


తీన్మార్ ప్రేరణ ప్రశ్న..

ప్రజా ప్రభుత్వం అంటే ఇచ్చి పుచ్చుకోవడమే..?
ఇటు వైపు పథకాల అమలు.. అటు వైపు పన్నుల వసూళ్లు..?
LRS వద్దన్న పార్టీ.. అవకాశం ఇస్తున్నామంటుందేంటి..?






రెడ్డి. శేఖర్
ఎడిటర్,
తీన్మార్ దినపత్రిక


ములుగు | సంపుటి : 02 | సంచిక : 313 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 28 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల ₹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


# 5 జిల్లాలు మినహా అంతటా ఎల్లో అలెర్ట్




ఇప్పటికే 35 డిగ్రీలతో మండుతున్న ఎండలు
12 జిల్లాల్లో నమోదైన 35 డిగ్రీల ఎండలు
మార్చి 01 నుంచి 37డిగ్రీలకు పెరిగే అవకాశం

2

## టీఎస్ లాసెట్, పీజీఎల్‌సెట్ షెడ్యూల్ విడుదల

మార్చి 01 నుంచి దరఖాస్తుల స్వీకరణ



2 లో..

## మాటిస్తే కాంగ్రెస్ వెనకడుగు వేయబోదు

సోనియా గాంధీ మాటిస్తే అది శిలాశాసనం: సీఎం రేవంత్ రెడ్డి

హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ కు ఓటేశారు.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అమలుచేస్తాం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): మాటిస్తే కాంగ్రెస్ వెనకడుగు వేయబోదన్నారు సీఎం రేవంత్ రెడ్డి. సోనియా గాంధీ మాటిస్తే అది శిలాశాసనమని చెప్పారు. సెక్రటేరియట్ లో 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల ఇండ్లలో వెలుగులు నింపుతున్నామన్నారు. చేవెళ్లలో లక్షమంది మహిళల ముందు రెండు గ్యారంటీలను ప్రారంభించాలనుకున్నాం కానీ మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ వల్ల చేవెళ్లలో ప్రారంభించలేకపోయామన్నారు రేవంత్. అందుకే సెక్రటేరియట్ లో రెండు గ్యారంటీలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. పేదలకు గ్యాస్ సిలిండర్

మిగతా 2 లో




## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లోని డాక్టర్ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే విజ్ఞాపనలను త్వరిత గతిన పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఒక కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ, ఈ కార్యక్రమంలో వచ్చే విజ్ఞాపనలపై సచివాలయంలో నేడు సాయంత్రం సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మిగతా 2 లో

## నో ఎల్ఆర్ఎస్.. నో బీఆర్ఎస్ అన్న కాంగ్రెస్ ఎల్ఆర్ఎస్ కు మొగ్గు చూపడం విడ్డూరం


ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ మోసపూరిత మాటలకు నిదర్శనం బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు



2 లో..

## సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకంపై జీవో జారీ చేసిన ప్రభుత్వం

తెల్ల రేషన్ కార్డు పథకం పథకాన్ని వర్తించనున్నట్లు స్పష్టం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో అర్హులైన వారికి రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు మరో కీలక అడుగు పడింది. సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకంపై ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకాన్ని వర్తింపచేయనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో రేషన్ కార్డు ఉన్న కుటుంబాల సంఖ్య 89.99 లక్షలుగా ఉంది. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి రూ.500కే గ్యాస్ సిలిండర్

మిగతా 2 లో





## ఆరేళ్లు నిండితేనే 1వ తరగతిలో అడ్మిషన్

నిబంధనల ఏర్పాటుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశాలు జారీ

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): చిన్న పిల్లలకు ఆరేళ్లు నిండితేనే ఒకటవ తరగతిలో అడ్మిషన్ ఇచ్చేలా నిబంధనలు రూపొందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మోడీ సర్కార్ లేఖలు రాసినట్లు సమాచారం. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (%చీజుూ%) 2020, రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009 కింద ఒకటవ తరగతిలో

మిగతా 2 లో



## కాంగ్రెస్ హామీలకు వ్యారంటీ లేదన్నవాళ్లు అడ్రస్ లేకుండాపోయారు

గాంధీ కన్న కలలు నిజం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ : మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ఇచ్చే హామీలకు వ్యారంటీ లేదన్న వాళ్లు అడ్రస్ లేకుండాపోయారని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశాం. ఇవాళ మరో రెండు గ్యారంటీలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. చేవెళ్ల జనజాతర

మిగతా 2 లో

## నేను ఓడితే రాజకీయ సన్యాసం చేస్తా : బండి సంజయ్

ఎంపీ బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ల మధ్య వాగ్యుద్ధం



2 లో..

# 5 జిల్లాలు మినహా అంతటా ఎల్లో అలెర్ట్





హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతున్నది. ఫిబ్రవరి పూర్తికాకముందే పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. మంగళవారం 12 జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో ఆ జిల్లాల్లో హైదరాబాద్ వాతావరణ కేంద్రం యెల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం కూడా దాదాపు అదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది. మరో రెండు రోజుల తర్వాత రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం గరిష్ట 35, కనిష్ట ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలుగా నమోదు అవుతున్నాయి. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత ఎక్కువ కానుంది. ఆ రోజు నుంచి పగటిపూట ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనే 34 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాలకు గురువారం యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా సూర్యాపేట, వనపర్తి, నల్గొండ, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడేం, భూపాలపల్లి, వికారాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్,నిజామాబాద్, ఖమ్మం, ములుగు, గద్వాలలో ఎండ తీవ్రత మరింత పెరగనున్నట్లు వెల్లడించింది. ఆ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36-37 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని పేర్కొంది. భారతవాతావరణ కేంద్రం కూడా తెలంగాణలో మార్చి 1 తర్వాత ఎండల తీవ్రత పెరుగుతుందని ప్రకటించింది.

## టీఎస్ లాసెట్, పీజీఎల్‌సెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): మూడేండ్లు, ఐదేండ్ల లా కోర్సులతో పాటు ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ లాసెట్, పీజీఎల్‌సెట్ -2024 షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 28వ తేదీన లాసెట్, పీజీ ఎల్‌సెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఏప్రిల్ 15. టీఎస్ లాసెట్ దరఖాస్తు రుసుం రూ. 900. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 600గా నిర్ణయించారు. టీఎస్ పీజీఎల్‌సెట్ దరఖాస్తు రుసుం రూ. 1100. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 900గా నిర్ణయించారు. రూ. 500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 25వ తేదీ లోపు, రూ. 1000 ఆలస్య రుసుంతో మే 5వ తేదీ లోపు, రూ. 2 వేల ఆలస్య రుసుంతో మే 15 లోపు, రూ. 4 వేల ఆలస్య రుసుంతో మే 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 20 నుంచి 25వ తేదీ మధ్యలో దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 30 నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. లాసెట్, పీజీఎల్‌సెట్ రాతపరీక్షలను జూన్ 3వ తేదీన కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. మూడేండ్ల కోర్సులో చేరేవారికి ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఐదేండ్లు, పీజీఎల్‌సెట్ రాతపరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాథమిక కీని జూన్ 6న విడుదల చేయనున్నారు.

## నో ఎల్ఆర్ఎస్.. నో బీఆర్ఎస్ అన్న కాంగ్రెస్ ఎల్ఆర్ఎస్ కు మొగ్గు చూపడం విడ్డూరం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి రాగానే, ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పిందని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్నారు. నో ఎల్ఆర్ఎస్ – నో బీఆర్ఎస్ అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలి. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నా అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## నేను ఓడితే రాజకీయ సన్యాసం చేస్తా : బండి సంజయ్

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య వాగ్యుద్ధం నడుస్తోంది. వారిద్దరూ సవాళ్లు, ప్రతి సవాళ్లు విసరుకుంటున్నారు. రాబోయే లోక్సభ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ సునాయాసంగా గెలుస్తుందని, తానే దగ్గరుండి గెలిపిస్తానని బండి సంజయ్ను ఓడగొడతానని పొన్నం ప్రభాకర్ సవాలు విసిరారు. దీనిపై బండి సంజయ్ పొన్నంకు ప్రతి సవాల్ విసిరారు. ఈసారి కూడా కరీంనగర్ ఎంపీగా తానే గెలుస్తానని, తాను గెలిస్తే మంత్రి పొన్నం రాజీనామా చేయడానికి రెడీనా అని బండి సంజయ్ ప్రతి సవాలు విసిరారు. ప్రజాహిత యాత్రపై దాడికి ఉసిగొల్పిన కాంగ్రెస్ నాయకుడికి సవాల్ విసురుతున్నా. పిరికివాడిలా పారిపోయే వాడిని కాదు ధైర్యంగా ధర్మం గురించి మాట్లాడేవాడిని. ఈ లోక్ సభ ఎన్నికల్లో నువ్వు కానీ, నువు నిలబెట్టిన అభ్యర్థి కానీ నా మీద గెలిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. ఓడిపోతే నువ్వు తీసుకుంటవా ఈ సవాల్ స్వీకరించే దమ్ముందా మీకు అని బండి సంజయ్ ప్రశ్నించారు. తన మత విశ్వాసాలతో రాముడి పేరుతోనే పార్లమెంట్ ఎన్నికల్లో నిలబడతానని బండి సంజయ్ అన్నారు. పొన్నం ప్రభాకర్ పెట్టుకొనే అభ్యర్థి కనుక గెలిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. తాను మళ్లీ రాముడు, హిందూ ధర్మం గురించి మాట్లాడానని.. ఒకవేళ నువ్వు ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా అని ప్రశ్నించారు. తాను ఎక్కడా తప్పుగా మాట్లాడలేదని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వాళ్ల అమ్మను అవమానించుకుంటున్నారని అన్నారు. తాను వాళ్ల అమ్మకి పాదాభివందనం చేస్తానని అన్నారు. రాముడు, తల్లి అంశాలపై కాంగ్రెస్ది అనవసర రాద్ధాంతమని అన్నారు. బీఆర్ఎస్ ఇదే విధానం అవలంభించి ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుంది. ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వం పథకాలను వివరిస్తున్నామని బండి సంజయ్ చెప్పారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా కొనసాగుతున్నందున తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17కు 17 స్థానాలు గెలవడం ఖాయమని అన్నారు. కరీంనగర్ అభివృద్ధిపై ఎలాంటి చర్చకైనా సిద్ధమని చెప్పారు. తమ ప్రభుత్వం 27 మంది బీసీలను మంత్రులను చేసిందని గుర్తు చేశారు.

## ఆరేళ్లు నిండితేనే 1వ తరగతిలో అడ్మిషన్



### మొదటి పేజీ తరువాయి

చేరే పిల్లలకు ఆరేళ్ల వయసు తప్పనిసరని లేఖలో కేంద్రం వెల్లడించింది. 2024 %--% 25 విద్యా సంవత్సరం నుంచే ఇది అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక, 3 నుంచి 8వ సంవత్సరాల వయసు మధ్యలో పిల్లలకు 3 ఏళ్ల ప్రి స్కూల్, 1, 2వ తరగతులు పూర్తయినను పిల్లలను నేర్చుకునేందుకు మంచి అవకాశాలుంటాయని నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో పేర్కొన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తు చేసింది. పిల్లలను ఒకటవ తరగతిలో చేర్చించే వయసు పలు రాష్ట్రాల్లో పలు రకాలుగా ఉందని గతంలో లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో కేంద్రం చెప్పుకొచ్చింది. నూతన విద్యావిధానం, విద్యా హక్కు చట్టంలో ఉన్న ప్రొవిజన్స్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. అయితే, 6 ఏళ్లు నిండితేనె ఒకటో తరగతిలో అడ్మిషన్ పై తెలంగాణ ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.. ఈ ఇష్యూపై విద్యా శాఖ అధికారులతో ఒక కమిటినీ వేసినట్టు సమాచారం. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీనీ తెలంగాణ సర్కార్ అడాప్ట్ చేసుకోలేదు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ తరవాత నిర్ణయం తీసుకుంటామని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, రేపు ఈ అంశం పై రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించే అవకాశం ఉంది. ఈ నిబంధనను సీబీఎస్ఈ స్కూల్స్ అమలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక ఏజ్, కేంద్ర ప్రభుత్వం ఒక ఏజ్ పెడితే ఇబ్బందులు వస్తాయని అధికారులు అంటున్నారు.

## కన్నుమూసిన మేడారం జాతర సమ్మక్క పూజారి

### పూజారి మృతితో ఆదివాసీల్లో విషాదం



ములుగు, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన వేడుక మేడారం జాతర. ఈ జాతరలో పూజారి బాధ్యతలు నిర్వతించిన ఒకరు కన్నుమూశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతర సమ్మక్క పూజారి అయిన సిద్ధమైన దశరథం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మేడారం జాతర ఘనంగా నిర్వహించింది. ఈ పూజా కార్యక్రమాల్లో సమ్మక్క పూజారి అయిన దశరథం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న పూజా దశరథం మంగళవారం తుదిశ్వాస విడిచారు. పూజారి మృతితో ఆదివాసీల్లో విషాదం నెలకొంది. మేడారం భక్తులు సైతం పూజారి దశరథం మృతిపట్ల సంతాపం ప్రకటిస్తున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు. మేడారం మహా జాతర ప్రధాన పూజారి సిద్దబోయిన లక్ష్మణ్రావు (45) 2023 అక్టోబర్లో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అక్టోబర్ మొదటి వారంలో వేకువజామున మృతి చెందారు. లక్ష్మణ్రావు స్వస్థలం తాడ్వాయి మండలం మేడారం. లక్ష్మణ్ రావు తన 20వ ఏట నుంచి మేడారం జాతరకు సేవలు అందిస్తున్నారు. మేడారంలో మొత్తం 11 మంది ప్రధాన పూజారుల్లో లక్ష్మణ్రావు ఒకరు. కానీ అనారోగ్య సమస్యలతో చిన్న వయసులోనే పూజారి కన్నుమూశారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు

### మొదటి పేజీ తరువాయి

శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు, కార్మిక, ఉపాధి కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య తదితర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రజా భవన్ లో ప్రతీ వారం రెండు రోజుల పాటు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజానీకానికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన పిటీషన్లను సంబంధించి పరిష్కారానికి గాను జిల్లా స్థాయిలో తగు నిర్ణయం తీసుకోవడం, అవసరమైతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడానికి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీలో పోలీస్, పంచాయితీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులను సభ్యులుగా నియమించాలని పేర్కొన్నారు. ఈ కమిటీ విధి విధానాలను వెంటనే రూపొందించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ను ఆదేశించారు. ఇకనుండి, ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి ప్రత్యేక్షంగా పర్యవేక్షిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నారని మంత్రి తెలియజేశారు. ఆరోగ్య పరమైన సమస్యలతో వచ్చే వారికీ వెంటనే సంబంధిత ఆసుపత్రులకు పంపించి సత్వర చికిత్సలు అందే విధంగా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజావాణికి అందే ఫిర్యాదులలో పోలీస్ శాఖ కు కూడా సంబంధం ఉన్నవి కూడా అధికసంఖ్యలో వస్తున్నం దున, ప్రజావాణికి ఒక సీనియర్ పోలీస్ అధికారిని నియమించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి మాట్లాడుతూ, ప్రజావాణిలో అందే ఫిర్యాదులను పరిష్కరించడంలో అత్యంత ప్రాధాన్యతనివ్వాలని అధికారులను కోరారు. ఈ ప్రజావాణికి ఉద్యోగ, ఉపాధి కల్పనకై అధిక సంఖ్యలో విజ్ఞాపనలు వస్తున్నందున ప్రతీ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టనున్న రెండు లక్షల ఉద్యోగాల నియామకాలపై కూడా వారికి అవగాహన కల్పించాలని డా.చిన్నారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంపై, అందిన ఫిర్యాదులపై చేపట్టిన చర్యలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రజావాణి నోడల్ అధికారి దివ్య వివరించారు.

## బీసీ జాబితాలో 26 కులాల తొలగింపుపై సుప్రీం విచారణ

**అఫిడవిట్‌ను దాఖలు చేసిన రేవంత్ సర్కార్**

**కులగణన తర్వాత నివేదిక సమర్పిస్తాం : తెలంగాణ ప్రభుత్వం**

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో బీసీ జాబితా నుంచి 26 కులాల తొలగింపుపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. బీసీ జాబితా నుంచి 26 కులాల తొలగింపుపై సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. ఈ పిటీషన్‌ను న్యాయమూర్తులు సుధాంశు, బాలచంద్ర ప్రసన్నల ధర్మాసనం విచారణ చేపట్టింది. కులగణన చేపడుతున్నామని సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను రేవంత్ సర్కార్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కులగణన తర్వాత బీసీ జాబితాపై నిర్ణయం తీసుకుంటామని అఫిడవిట్‌లో తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. కులగణన తర్వాత నివేదిక సమర్పిస్తామని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## మాటిస్తే కాంగ్రెస్ వెనకడుగు వేయబోదు

### మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలన్న ఆలోచన కాంగ్రెస్ దేనన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఆనాడు దీపం పథకం కింద మహిళలకు రూ. 400 లకే కాంగ్రెస్ గ్యాస్ సిలిండర్ ఇచ్చిందన్నారు. బీజేపీ వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 లకు పెరిగింది. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని చెప్పారు రేవంత్. తాము ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ కు ఓటేశారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. సోనియా మాటిస్తే తెలంగాణలో తప్పకుండా చేస్తామన్నారు. ఆర్థికంగా నియంత్రణ పాటిస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు రేవంత్. నూటికి నూరుశాతం గ్యారంటీలు అమలు చేస్తాం. ఎవరెన్ని ఎలాంటి దుష్ప్రచారాలు చేసినా నమ్మొద్దని సూచించారు. దేశంలో తెలంగాణ నమూనా తీసుకొస్తామని తెలిపారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు చేస్తున్నామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. బడుగుబలహీన వర్గాల కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. దేశమంతా ఈ రెండు గ్యారంటీల కోసం ఎదురుచూస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా వెనకడుగు వేయబోమన్నారు. ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే హామీలు అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై బీఆర్ఎస్ రోజూ దష్ప్రచారం చేస్తోందన్నారు. 200 యూనిట్లు వాడే వారికి మార్చిలోపు జిరో కరెంట్ బిల్లు వస్తుందని చెప్పారు భట్టి. పథకాల అమలులో ఎలాంటి ఆంక్షలు విధించడం లేదన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. అర్హులు మిగిలి ఉంటే మండలాఫీసుల్లో అప్లై చేసుకోవాలి. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు భట్టి విక్రమార్క.

## సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకంపై జీవో జారీ చేసిన ప్రభుత్వం

### మొదటి పేజీ తరువాయి

ఇవ్వనున్నారు. గ్యాస్ కంపెనీలకు నెలవారీ సబ్సిడీ చెల్లిస్తామని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులను గ్యాస్ కంపెనీలు బదిలీ చేయనున్నాయి. మూడేళ్ల సరాసరి వినియోగం ఆధారంగా సిలిండర్లు ఇవ్వనున్నారు. ఈ పథకం అమలుకు సంబంధించి తక్షణం నియమావళి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో సాధారణ ప్రజలతో పాటు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారిని కూడా మహాలక్ష్మి పథకం కిందకు తీసుకువస్తున్నారు. అయితే, పథకం లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ తీసుకున్నప్పుడు పూర్తి ధర చెల్లించాల్సిందేనని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది. ఆ తర్వాత రూ.500 అదనంగా చెల్లించిన ధరను ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రీయింబర్స్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోన్న రూ.40 రాయితీని కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు సమాచారం. హైదరాబాద్ లో సిలిండర్ ధర రూ.955 ఉంటే.. వినియోగదారుడు చెల్లించాల్సిన రూ.500, కేంద్ర రాయితీ రూ.40 పోనూ మిగతా రూ.415ని రాష్ట్ర ప్రభుత్వం రాయితీగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందని తెలుస్తోంది. మరోవైపు, 'గృహజ్యోతి' పథకం కింద 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకాన్ని కూడా ప్రారంభించనున్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల ద్వారా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా పాలనలో దరఖాస్తు చేసిన తెల్లరేషన్ కార్డుదారులకు ఈ పథకాన్ని వర్తింపచేయనుంది. మీటర్ రీడింగ్ కు వెళ్లినప్పుడు దరఖాస్తుదారుల ఆధార్, తెల్లరేషన్ కార్డులను విద్యుత్ సిబ్బంది పరిశీలించారు. అయితే, ఇంకా కొన్ని చోట్ల పరిశీలన పూర్తి కాలేదు. ఎంపికైన లబ్ధిదారులకు మార్చిలో జీరో విద్యుత్ బిల్లు ఇవ్వనున్నారు.

## కాంగ్రెస్ హామీలకు వ్యారంటీ లేదన్నవాళ్లు అడ్రస్ లేకుండాపోయారు

### మొదటి పేజీ తరువాయి

సభలో మాట్లాడిన ఆమె తప్పుడు కూతలు కూసినవాళ్లు అడ్రస్ లేకుండా పోయారని మండిపడ్డారు. కాంగ్రెస్ పై అపనమ్మకాలు సృష్టించే కుట్ర జరుగుతోందన్నారు. గాంధీ కన్న కలలు నిజం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. హామీలు అమలు చేస్తుంటే బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకుంటే బాగుంటుందని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని చెప్పారు. రూ.400ల సిలిండర్ ను బీజేపీ రూ.1200లకు పెంచిందన్నారు. పేదలు కరెంట్ వాడలేని పరిస్థితి వచ్చిందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చి పేదలను ఆదుకుంటున్నామని చెప్పారు సీతక్క. ఆడవాళ్లు ఆర్థికంగా,సామాజికంగా,రాజకీయంగా బలంగా ఉన్నప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మనిషి మలంలో ఔషధ గుణం

మనిషి అత్యంతంగా అసహ్యించుకునేది తన శరీరం విసర్జించే మలాన్నే. అది కంటబడ్డా, ముక్కుకు దాని వాసన తగిలినా ఛీ అంటూ దూరమెళ్లిపోతాడు. ఇంత నీచంగా చూసే మలం మరో మనిషికి ఔషధంలా పని కొస్తుందంటే నమ్మగలమా! నిజమే.. ఆరోగ్యవంతుడి మలం ఔషధమే. ఎన్ని మందులు వాడినా లొంగని కడుపు నొప్పి కష్టాలు మలం మార్పిడి ద్వారా దారి కొస్తాయని వైద్య పరిశోధనలు నిరూపించాయి. జీర్ణ వ్యవస్థలో మంట, పేగుల పొరల మధ్య ఏర్పడ్డ పుండ్లతో దీర్ఘకాలంగా బాధపడుతున్న వారికి మల మార్పిడి తగిన చికిత్స అని తేలింది. ఆరోగ్యవంతుడి మలాన్ని బాధితుడి పేగుల్లోకి చేర్చడం ద్వారా దానిలోని మంచి బాక్టీరియా రోగ కారకాలను అంతం చేస్తుందని డాక్టర్లు అంటున్నారు. మలమార్పిడి ఇప్పుడు ఆధునిక చికిత్సా విధానాల్లో ఒకటి. శరీరంలోని అవయవాల మార్పిడి మాదిరే మలమార్పిడి కూడా వైద్యంలో భాగమైంది. అల్సరేటివ్ కొలైటిస్ అనే ప్రేగు వ్యాధి జీర్ణ వ్యవస్థను పీడించే రుగ్మతల్లో ఒకటి. దీని వల్ల ఎప్పుడూ పొత్తి కడుపులో నొప్పి, తల తిరగడం, బరువు తగ్గడం జరుగుతుంటాయి. దాని ప్రభావం తీవ్రమైనప్పుడు రోగులు డయేరియా, రక్త విరేచనాల బారిన పడతారు. కడుపులో మంట వల్ల అన్నం సహించక, తిన్నా అరగక బలహీనపడడంతో మరిన్ని ఆరోగ్యసమస్యలు చుట్టుకుంటాయి. తింటుండగానే మధ్యలో దొడ్డికి రావడం, మసాలా పడితేనే విరేచనాలవడం దీని లక్షణం. బాధితులు బంధువులింటికెళ్లినా, ఫంక్షన్స్‌కి వెళ్లినా భయంతో ఏమీ తినలేక, ఎవరికీ చెప్పలేక ఇబ్బందిపడుతుంటారు. ఇలాంటి సమస్యలకు మల మార్పిడియే శరణ్యం అని ఈ చికిత్స చెబుతోంది. ఆరోగ్యవంతులైన కుటుంబ సభ్యుల లేదా ఇతరుల మలం సేకరించి పరీక్షించి రోగి పేగుల్లోకి ఎక్కించడం ద్వారా ఉపశమనం లభిస్తుంది. ఏడేళ్లుగా స్టిరాయిడ్స్‌తో అదుపులో పెడుతున్న తన అల్సరేటివ్ కొలైటిస్ బాధ మలమార్పిడి ద్వారా పూర్తిగా నయమైందని 1989లో అమెరికాకు చెందిన డా. బెన్నెట్ ప్రకటించి ఆ వైపు వైద్యశాస్త్రం దృష్టిని మరల్చారు. 2003లో ఆస్ట్రేలియాలో అయిదేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆరుగురు పేషెంట్లను నాలుగు నెలల వ్యవధిలో ఐదు వారాలు మలమార్పిడి చేసి మందులు వాడే అవసరాన్ని దూరం చేశారు. ఎన్ని మందులు వాడినా మళ్ళీమళ్ళీ పుట్టుకొచ్చే పేగు పుళ్లకు మలమార్పిడి తగిన చికిత్స అని 2013లో అమెరికాలోని ఫెడరల్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదించింది. నవంబర్ 2014లో ఢిల్లీలోని మణిపాల్ హాస్పిటల్ లో డా. అవినాష్ సేథ్ ఆధ్వర్యంలో మన దేశంలో తొలిసారిగా ఈ చికిత్స జరిగింది. ఇప్పుడు విదేశీయులు కూడా అక్కడ వైద్యానికి వస్తున్నారని ఇండియన్ జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిలో డా. అవినాష్ రాశారు. 2019లో కేరళలోని ఎర్నాకులం మెడికల్ సెంటర్ హాస్పిటల్‌లో పది మంది రోగులకు ఈ మార్పిడి చేసి వారిని బాధల నుంచి విముక్తులను చేశామని డా. మాత్యు ఫిలిప్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. కొచ్చిలో ఈ చికిత్స కోసం ఓ ప్రత్యేక వైద్యశాల ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. 2021లో పునేలో మొదటిసారిగా దీనానాథ్ మంగేష్కర్ హాస్పిటల్ లో డా. పరీక్షిత్ ప్రయాగ్ నేతృత్వంలో ఒక మహిళకు ఈ చికిత్స జరిగి సత్ఫలితాలను ఇచ్చింది. కడుపు నొప్పి తగ్గాలని మితిమీరిన యాంటీ బయోటిక్స్ వాడకం వల్ల పేగుల్లోని మంచి బాక్టీరియా పూర్తిగా ధ్వంసమై కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయని, అందుకే దీనికి మల మార్పిడియే సురక్షిత పరిష్కారమని డా. ప్రయాగ్ అన్నారు. జనవరి 2022లో రక్త విరేచనాలతో బాధపడుతున్న 78 ఏళ్ల వృద్ధుడిని ఢిల్లీలోని సర్ గంగారాం దవాఖానలో మలమార్పిడి జరిగి, ఆ వృద్ధుడి శేష జీవితానికి సుఖశాంతులను అందించింది. సేకరించిన మలాన్ని శుద్ధిచేసి మలద్వారం ద్వారా పెద్ద పేగులోకి, ముక్కులో పైపు ద్వారా చిన్న ప్రేగులోకి పంపామని, ఈ విధానం ద్వారా ప్రేగులు కోల్పోయిన రోగ నిరోధక శక్తిని పునరుద్ధరింపజేయవచ్చని ఆ చికిత్స చేసిన డా. పీయూష్ రాజన్ తెలిపారు. ఈ మధ్య క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, లూథియానాలో కూడా ఈ చికిత్స మొదలైనట్లు లివర్ అండ్ బైలరీ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. ఈ ప్రక్రియ కోసం మల దాతను ఎంచుకునే ముందు ఆయనకు ఎన్నో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆయనకు ఎలాంటి అంటురోగాలు లేవని నిర్ధారణకు రావాలి. ఎంపికైన వారితో చికిత్సకు ఒక రోజు ముందుగా మలం సేకరించమని చెబుతారు. మలం మెత్తబడేలా దాత లాక్సేటివ్స్ వాడాలి. ప్లాస్టిక్ డబ్బాలో భద్రపరిచిన మలాన్ని ఇంటి నుండే పంపించవచ్చు. మలంలోని మంచి బాక్టీరియా ఎనిమిది గంటల పాటు బతుకుతుందట. హాస్పిటల్ చేరిన మలాన్ని సెలైన్, డిస్టిల్ నీటితో శుభ్రం చేసి, అనవసరాలను తొలగించి సిరంజీల ద్వారా మలద్వారం నుండి రోగి ప్రేవుల్లోకి పంపిస్తారు. ఒక్కో సిట్టింగ్‌కు రూ. 25 వేలు ఖర్చయ్యే ఈ చికిత్స ద్వారా మూడు, నాలుగు సార్లు మార్పిడితో రెండు నెలలలో రోగి ఆరోగ్యం చక్కబడుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అవసరానికి రక్తాన్ని అమ్మినట్లే తమ మలాన్ని అమ్ముకొనే ఆరోగ్యవంతులు బయటి దేశాల్లో ఇప్పటికే తయారయ్యారు. ఆరోగ్యవంతుడి మలానికి విదేశాల్లో మంచి డిమాండు ఉంది. మేలురకం మలానికి తగిన డబ్బు చెల్లిస్తామని హాస్పిటళ్లు ప్రకటనలు ఇస్తుంటాయి. రక్తదానం లాగే మలదానం ఉదారంగా చేసేవారు కూడా ఉన్నారు. బ్లడ్ బ్యాంకుల్లాగే స్టూల్ బ్యాంక్‌ల ఏర్పాటు కూడా జరుగుతోంది. ఒక స్టూల్ బ్యాంక్ ఏర్పాటు చేయడానికి రూ. 15 కోట్ల దాకా ఖర్చవుతుందని, నెల నెల నిర్వహణకు రూ. పది లక్షలు అవసరమవుతాయని తెలుస్తోంది. మన దేశంలో కొన్ని మహా నగరాల్లోనే ఈ చికిత్స అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లోని కొన్ని హాస్పిటళ్లు ప్రభుత్వ అనుమతి కోరినట్లు తెలుస్తోంది. వ్యర్థాలుగా విసర్జింపబడుతున్న మలంలో మనిషికి మంచి చేసే లక్షణం ఉందని కనుగొన్న పరిశోధకులకు చేతులెత్తి మొక్కాల్సిందే!

# పేరుకే పదో తరగతి విద్యార్థుల ప్రేరణ తరగతులు.....

- చేసింది మాత్రం పెద్ద సారుకు సన్మానం
- సంక్షేమ ఎస్ఎస్సి విద్యార్థులపై ప్రత్యేక పట్టింపేది...?
- డివిజన్ స్థాయిలో విద్యార్థులు లేకుండానే మోటివేషన్ క్లాసులా...?
- తూ తూ మంత్రంగా కొద్ది సేపటికే ముగింపు
- ఆశ్చర్యానికి గురైన విద్యార్థులు
- అన్నీ తెలిసిన హాస్టల్ వార్డెన్ ల మౌనం ఎందుకు....?



నల్లగొండ జిల్లా బ్యూర్, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): నల్లగొండ జిల్లాలో ఎస్సి అభివృద్ధి శాఖ ద్వారా పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహణలో నల్లగొండ డివిజన్ పరిదిలో తూ తూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. బోర్డ్ ఎగ్జామ్స్ అంటే నడక కాదు. సమయానికి ముందే బహుళ సబ్జెక్టుల మొత్తం సిలబస్ కవర్ చేయడానికి శ్రద్ధ, అంకితభావం అవసరం. విద్యార్థులు ఈ భారీ పనికి తమను తాము సర్దుబాటు చేసుకోవడం, వారి లక్ష్యాలను చేరుకోవడంలో ఒత్తిడిని అనుభవిస్తారు. 10వ తరగతి విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, తోటివారి నుండి ఆదర్శప్రాయమైన మద్దతు అవసరమయ్యే సమయం ఇది. అన్ని సబ్జెక్టులను అధ్యయనం చేయడానికి వారి పరిమిత సమయాన్ని ఉపయోగించడంలో వారు చాలా కాలిక్యులేటివ్ గా ఉండాలి. 10వ తరగతి విద్యార్థులు అనుసరించ డానికి, విజయం సాధించడానికి ప్రేరణ ఎంతో అవసరం. విద్యార్థులకు ప్రేరణ ఉన్నప్పుడే సరైన వ్యూహం, అనుగుణ్యత వారిని తరగతి బోర్డు పరీక్షల సవాళ్లను సమర్ధవంతంగా అధిగమించేలా చేస్తుంది. అయితే జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ అధికారుల తీరు మాత్రం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. మరి కొద్ది రోజుల్లోనే పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం రెండు, మూడు నెలల ముందుగానే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని చదివిస్తూ ఉండాలి. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా డైట్ ఏర్పాటుచేసిన ప్రభుత్వ, సబ్జెక్ట్ నిపుణుల చేత అవగాహన కల్పించాలి.

పరీక్షల్లో అనుసరించాల్సిన మెలకువలను చెప్పాలి. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులు భయభ్రాంతులకు గురి కాకుండా ప్రేరణ తరగతులను నిర్వహించాలి. అయితే మంగళవారం జిల్లా కేంద్రంలోని డిఈఓ ఆఫీస్ ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల ఏ, బి, సి, డి వసతి గృహ కాంప్లెక్స్ లోని నల్లగొండ డివిజన్ కు సంబంధించి పదవ తరగతి వసతి గృహ విద్యార్థుల కు ప్రేరణ తరగతులు నిర్వహించారు. అయితే ఇక్కడ పూర్తిస్థాయి విద్యార్థులు హాజరు కాకుండానే, ప్రత్యేక నిపుణులు లేకుండానే,





ఈ విధంగా విద్యార్థులతో స్వేచ్ఛగా వదిలి అవగాహన కల్పించాలి

తూ తూ మంత్రంగా ప్రేరణ తరగతులను నిర్వహించడం ఎంతో విచారకరం. ప్రారంభం తర్వాత కొద్ది సేపటికే ముగించడం, ఇది ప్రస్తుతం హాస్టల్ వార్డెన్ లలో, విద్యార్థి సంఘ నాయకుల్లో చర్చనీ యాంశంగా మారింది. సంఘ సంస్కర్తలు, విద్యావేత్తలు హాస్టల్ ల పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచి ముందుగా హాస్టల్ వార్డెన్ లకు అవగాహన కల్పించ డం చాలా అవసరమని విమర్శలు వినిపిస్తున్నాయి.

నల్లగొండ డివిజన్ కు సంబంధించి మునుగోడు, నకిరేకల్, బ్రాహ్మణ వెల్లంల, నల్లగొండ పట్టణంలోని బాలుర, బాలికల హాస్టల్లోని పదవ తరగతి విద్యార్థులు సుమారు 350 కి పైగా ఉంటారు. వారెవరు మోటివేషన్ తరగతికి హాజరు కాకుండానే మోటివేషన్ క్లాస్ సాదా సీదా గా నిర్వహించారు. కేవలం మోటివేషన్ క్లాస్ నిర్వహించిన హాస్టల్ విద్యార్థులను మాత్రమే మోటివేషన్ క్లాస్ కు పిలిపించి మోటివేషన్ క్లాస్ నిర్వహించి, అంతే అని ముగించేశారు. విద్యార్థులు లేకుండా మోటివేషన్ తరగతి నిర్వహించడం పై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయభ్రాంతులకు లోనవుతారని, మానసిక ఒత్తిడికి గురవుతారని, అలాంటి వారికి ప్రేరణ కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొంటున్నారు. సంక్షేమ శాఖ అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మండిపడుతున్నారు. సంక్షేమ శాఖ అధికారులకు పట్టింపు లేకపోవడం వల్లే విద్యార్థులు ఆగమైపోతున్నారని విమర్శిస్తున్నారు. విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ అనేది జిల్లాస్థాయి అధికారికి, డివిజన్ స్థాయి అధికారికి ఎంత మాత్రం లేదని, ఇటీవలే ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ లో మోటివేషన్ తరగతిని ఎలా నిర్వహించారో వారికి తెలియదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ లతో మోటివేషన్ తరగతులను నిర్వహించాలని కోరుతున్నారు.

**మోటివేషన్ తరగతులను నిర్వహిస్తున్నాం..**
**– శ్రీనివాస్ (జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి)**

పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ప్రేరణ తరగతులను నిర్వహిస్తున్నాం. మంగళవారం నల్లగొండ తో పాటు, మిర్యాలగూడ లోని మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఒత్తిడి లేకుండా విద్యార్థులు పరీక్షలను ఎలా రాయాలో మోటివేషన్ క్లాసులో చెబుతారు. సంక్షేమ SSC విద్యార్థులకు ప్రేరణ, మోటివేషన్ తరగతులు అని చెప్పి సంక్షేమ పెద్ద సారుకు సన్మానం చేశారు. ఇది ఎంత విడ్డూరంగా ఉందో చూడండి. గత వారం క్రితం

ఈ విషయం జిల్లా స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ కూడా గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల కు వెళ్లి వారికి ఎంతో ప్రేరణ కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై మన జిల్లా కలెక్టర్ & అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూద్దాం....





# పోరాట పటిమకు నిప్పు కనిక ఆజాద్

రామన్నపేట, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఈరోజు చంద్రశేఖర్ ఆజాద్ 93 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎర్రగడ్డ సెంటర్ లో ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వేముల సైదులు పాల్గొని వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ కి లొంగని స్వాతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ అజాద్.అని భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల సహచరుడిగ దేశం గర్వించదగ్గ ఉద్యమకారులల్లో ఒకరుడిగా తను 25 సంవత్సరాల వయసులోనే శత్రువు చేత చిక్కక తనను తాను ఆత్మాహుతి చేసుకొని వీర స్వర్గం పొంది, అమరవీరునిగా భారత ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగ నిలిచారని చంద్రశేఖర్ అజాద్ ను మరొకమారు యువత గుర్తుచేసుకొని ఆయన ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరు భాగమయ్యి ప్రతి రంగంలో పోటీ తత్వంతో రాణించి సామాజిక సేవలో యువత మీ బాధ్యతగా



కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఈదులకంటి శివకుమార్, గణేష్, చిల్ల యాదగిరి, కన్నెబోయిన నవీన్, నడిగోటి కమలాకర్, మారయ్య, ఆరూరి దామోదర్, జయసుధ, యాదమ్మ, భార్గవి, కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# నరేష్ పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా, రాజాపేట మండలం, కాల్వపల్లి గ్రామానికి చెందిన ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ యువజన నాయకుడు దళిత నాయకుడు ఇంజ నరేష్ పై జరిగిన దాడి పై జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎం ఈ ఎఫ్ నాయకులు మంగళవారం ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు రాజకీయంగా ఎదుగుతున్న అంశం పై ఓర్వలేక అక్కసుతో చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ దాడికి గురైన ఇంజ నరేష్ ఇంటి వద్ద దండోరా బృందం పరామర్శించారు. అనంతరం రాజపేట మండల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టం క్రింద కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఆందోళన చెపడుతామని హెచ్చరించారు. దళితుల పై దాడి చేస్తే దండోరా చూస్తూ ఊరుకోదని దళితుల చిన్న చూపు చుసే వ్యక్తుల గుండెల్లో గుబులు రేపుతామని ఏ పార్టీలో ఉన్న జాతీ పరంగా ఐక్యంగా సాగుతామని తెలిపారు. మాదిగ జాతీ బిడ్డ లకు ఏ చిన్న ఆపద వచ్చిన దండోరా నిత్యం తోడు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, జాతీయ నాయకులు మంద శంకర్, నాయకుడు దండోరా మండల ఇంచార్జ్ ఎర్రగుంట ప్రభాకర్, నాయకులు భూడిద జానీ, ప్రధాన కార్యదర్శి నల్ల బాలరాజు, మండల కన్వీనర్, ఇంజా మహేష్ మాదిగ, నాయకులు రామగళ్ల శ్రీనివాస్ మాదిగ, పెద్దోళ్ల ప్రభాకర్ మాదిగ, కోయ బాలరాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రి జిల్లాలో ఏడు కొత్త పంచాయతీలు

ఆలేరు: యాదాద్రి భువనగిరి జిల్లాలో కొత్తగా ఏడు గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. కొత్తగా ఏర్పాటు కానున్న పంచాయతీలు అన్నీ ఆలేరు శాసనసభ నియోజకవర్గంలోనివే కావడం విశేషం. ప్రస్తుతం జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రజలకు మెరుగైన పాలనను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం కొత్త పంచాయతీలను ప్రతిపాదించింది. పంచాయతీ పరిధిలో కిలో మీటరు వరకు విస్తరించి ఉంటే, జనాభా 500కు పైబడి ఉంటే సదరు గ్రామపంచాయతీలోని విలీన గ్రామాలను విభజించి పంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం గతంలో సూచనలు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. జిల్లాలో 421 పంచాయతీలు ఉండగా కొత్తగా ప్రతిపాదించిన పంచాయతీలకు ప్రభుత్వం అనుమతిస్తే మొత్తం 428కి చేరుతుంది. ఆలేరు మండలం కొలనుపాక మేజర్ పంచాయతీ నుంచి భైరాంనగర్, ఆలేరు పురపాలిక నుంచి సాయిగూడెం,ఉంటే సదరు గ్రామపంచాయతీలోని విలీన గ్రామాలను విభజించి పంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం గతంలో సూచనలు జారీ చేసింది తుర్కపల్లి మండలం వేల్పుపల్లి నుంచి గూజవాణి కుంటతండా,

గంధమల్ల నుంచి ఇందిరానగర్, మోటకొండూరు మండలం అమ్మనబోలు నుంచి అబిద్‌నగర్, మాటూరు నుంచి పెద్దబావి, బిరామారం మండలం యావాపూర్‌తండా నుంచి కాజీపేట కొత్తగా పంచాయతీలుగా ప్రతిపాదించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారు. కొద్ది రోజుల్లో కొత్త పంచాయతీలు సాకారమయ్యే అవకాశం ఉంది.



# దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – ఎస్సై సుధాకర్ రెడ్డి



రాజపేట, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): ఈ మధ్యకాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాజపేట మండల ఎస్సై సుధాకర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బైకుల దొంగతనాలు, పశువుల దొంగతనాలు, ట్రాన్స్ఫార్మర్ దొంగతనాలు జరుగుతున్నాయని, వేరే ఉరు వెళ్లాల్సి వస్తే తప్పకుండా ఇంటి పక్క వారికి మరియు పోలీసు శాఖ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు గస్తీ తిరుగుతారాని, షాపులు ఉన్నవాళ్లు ఎట్టి పరిస్థితిలో షాపులో క్యాష్ కౌంటర్లు డబ్బు, విలువైన వస్తువులు ఉంచకూడదన్నారు. షాపు యజమానులు షాపు బయట లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి వద్ద లేదా మహిళలు పొలాల వద్ద ఉన్నప్పుడు అపరిచిత వ్యక్తులు అడ్రస్ అడగడానికి లేదా మరేదైనా పని ఉంద0టూ ఒంటరి మహిళల దగ్గరకు వచ్చి మెడలో గొలుసులు లాక్కొని వెళ్లే ప్రయత్నం చేస్తారని, దానిపైన కూడా ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, మరియు పరిచయం లేని వ్యక్తులు టీవీ రిపేర్ అని ఇంటర్నెట్ కనెక్షన్ అని ఇల్లు అద్దెకు కావాలని వస్తారని వారి విషయం లో జాగ్రత్త వహించాలన్నారు. పిల్లల్ని ఎత్తుకుపోతున్నారని అక్కడక్కడ వార్తలు వస్తున్నాయని, రాత్రివేళ ఎవరైనా తెలిసినా వాళ్లు పిలిచినట్టు పిలిచిన తొందరపడి డోర్ తెరువొద్దని రాత్రి వేళల్లో గ్రామ యూత్ మరియు కమ్యూనిటీ వాళ్ళు కలిసి గ్రామాల్లో తిరిగి పోలీస్ శాఖ వారికి సహకరించండి దొంగతనం అయిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# పరీక్షలు రాసే ఇంటర్ విద్యార్థులకు ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లు సహకరించాలి

## – యాదగిరిగుట్ట డిపో మేనేజర్ శ్రీనివాస్



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): ఈనెల 28వ, తేదీ బుదవారం ఈరోజు నుండి వచ్చే నెల 19వ, తేదీ మంగళవారము వరకు "ఇంటర్మీడియట్" పరీక్షలు ఉన్నందున, పరీక్షలు వ్రాసే విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సహకరించాలని డ్రైవర్, కండక్టర్ లకు, డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసే విద్యార్థినీ విద్యార్థులు వారి వద్ద వాలిడిటీ కలిగిన బస్ పాస్/ఒరిజినల్ అధార్ కార్డ్ (విద్యార్థినులకు) తోపాటు ఇంటర్మీడియట్ హాల్ టికెట్ ఉన్నట్లయితే, రూట్ తో, దూరం తో సంబంధం లేకుండా, పరీక్ష కేంద్రం వరకు వారిని అనుమతిస్తారన్నారు. రూట్ బస్సు పాస్ కలిగిన విద్యార్థులను ఎక్స్ ప్రెస్ బస్సులలో కాంబినేషన్ టికెట్ తో అనుమతిస్తారని, సెలవు రోజు కూడా పరీక్ష ఉన్నట్లయితే అనుమతించాలని సిబ్బందికి తెలియజేశారు. బస్ పాస్ లేని విద్యార్థులు తప్పకుండా టికెట్ తీసుకోవాలని కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి ఆలేరు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు

## – ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య






యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త తెలుపగా లిప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రాష్ట్ర, ఆలేరు నియోజకవర్గ ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వనికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రోజు రాష్ట్ర సచివాలయంలో 500కే గ్యాస్,200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఆరు గ్యారెంటీల్లో మరో రెండు గ్యారెంటీలను అమలు చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. జీవో రిలీస్ చేసినందుకు గ్యారెంటీల అమలుకు దశ దిశ నిర్దేశం చేసిన కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులకు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సోమప్ప జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



నేరేడుచర్ల, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలం, సోమారం గ్రామపంచాయతీ పరిధిలోని సోమప్ప దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సైదులు అధ్యక్షతన ఉత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ మార్చి 7 నుండి 11 వరకు జాతర జరుగుతుందని భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని వివిధ శాఖల అధికారులను కోరారు. తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. భక్తులకు అసౌకర్యము కలగకుండా స్నానాలు చేయడానికి నీటి ట్యాంకులను ఉంచాలని కోరారు. విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒక డాక్టర్ ఉండాలన్నారు. ఈ సమావేశంలో హుజూర్ నగర్ ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జాతర ప్రాంతంలో కల్లు, మద్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య పనులను సోమారం గ్రామపంచాయతీ సిబ్బంది చేయాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ సిబ్బందిని తహసీల్దార్ కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈవో మృత్యుంజయ శాస్త్రి, ఆలయ ప్రధాన పూజారి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లుట్ల వీరయ్య అకాల మరణాన్ని చింతిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపిన పలువురు నాయకులు



గరిడేపల్లి, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): హుజూర్ నగర్ నియోజకవర్గ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి స్వచ్ఛంద సంస్థ ద్వారా బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వైద్యం ఆర్థిక సాయం లో ముందుంటూ "ఓజోన్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు తండ్రి పిల్లుట్ల వీరయ్య అకాల మరణానికి చింతిస్తూ వారి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ ప్రజా సంఘాలు, అఖిలపక్ష రాజకీయ యువత జోన్ ఫౌండేషన్ సభ్యులు హుజూర్ నగర్ మరియు నేరేడుచర్ల నాయి బ్రాహ్మణ సంఘ కమిటీ సభ్యులు పిల్లుట్ల వీరయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆజాద్ విగ్రహానికి నివాళులు



నారాయణ్ పేట, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): బిజ్వార్ గ్రామంలో ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ గ్రామ కార్యదర్శిం పివైఎల్ నారాయణ పేట జిల్లా ఉపాధ్యక్షులు సిద్దు నివాళ్ళర్పించి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ యువకుల్లో చంద్రశేఖర్ అజాద్ కూడా ఒకరు. 1903 జులై 23 న అలహాబాద్‌లోని ఓ మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అజాద్ అసలు పేరు చంద్రశేఖర్ సీతారామ్ తివారి. అజాద్ తల్లి అతడిని సంస్కృతంలో పెద్ద పండితుడు కావాలని కలలు గన్నారు. అయితే చదువు అబ్బకపోవడంతో తల్లిదండ్రుల ఒత్తిడి భరించలేక తన పదమూడో ఏట ముంబయికి పారిపోయి ఓ మురికివాడలో కూలి పనిచేసుకుంటూ జీవనం సాగించాడు. ఇక్కడ కష్టాల కన్నా సంస్కృతం చదవడమే మేలనిపించి తిరిగి ఇంటికి చేరుకుని 1921లో పాఠశాలలో చేరారు. అదే ఏడాది గాంధీజీ చేపట్టిన సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొని స్కూల్ ఆవరణలోనే నినాదాలు చేయడంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్లారు. పోలీసులు చంద్రశేఖర్‌ను కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరిచినప్పుడు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా నా పేరు ఆజాద్, నా తండ్రి పేరు స్వాతంత్రం అని, మేము నివసించేది జైల్లో అంటూ పలికారు. దీంతో న్యాయవాది 15 రోజులు జైలు, పదిహేను కొరడా దెబ్బలు శిక్ష విధించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో భగత్ సింగ్, రాజ్‌గురు, పండిత రామ్‌ప్రసాద్ లతో కలిసి పనిచేశారు. వీరి నాయకత్వంలో ఏర్పడిన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌కు ఆజాద్ ముఖ్య వ్యూహకర్తగా పనిచేశారు. 1925 వరకు ఓ సాధారణ దేశభక్తుడిగా తెలిసినా అదే ఏడాది జరిగిన కాకోరీ రైలు దోపిడీతో ఆజాద్ పేరు దేశమంతా మారుమోగిపోయింది. 1929లో లాలాలజపతి రాయ్‌పై అకారణంగా దాడిచేసి ఆయన చావుకు కారణమైన బ్రిటిష్ అధికారి స్కాట్ హత్యకు పథకం వేశారు. అయితే పోలీస్ స్టేషన్‌ను నుంచి స్కాట్ బయటకు వచ్చే సమయంలో అతడిని చంపడానికి పథకం వేసినా అది విఫలమైంది.

ఆ సమయంలో బయటకు వచ్చిన సాండర్స్‌ను స్కాట్‌గా భావించి తుపాకితో కాల్చి చంపారు. వీటిలో కీలకంగా వ్యవహరించిన అజాద్ యువతలో దేశభక్తి రగలించాడనడంలో ఎలాంటి సందేహం లేదు. చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల తూటాలకు ఈ ఆజాద్ బయపడడంటూ చేసిన నినాదం జాతీయోద్యమ కాలంలో ప్రాచుర్యం పొందింది. అవిశ్రాంత యోధుడిగా పేరుగాంచిన అజాద్‌ను అతని సన్నిహితులు క్విక్ సిల్వర్ అని పిలుచుకునేవారు.

1931 ఫిబ్రవరి 27 ఉదయం అలహాబాద్‌లోని అల్‌ఫ్రెడ్ పార్క్‌లో సుఖదేవ్‌తో సమావేశమైనట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆజాద్‌పై హఠాత్తుగా దాడి చేశారు. వారి నుంచి తప్పించుకోడానికి ప్రయత్నించిన అజాద్‌పై పోలీసులు కాల్పులు జరపడంతో భయపడకుండా వారిని ఎదురించాడు. సుఖ్‌దేవ్ అక్కడ నుంచి తప్పించుకునే వరకు వారితో పోరాడి అజాద్ తన రివాల్వర్‌తోనే ప్రాణార్పణ చేసుకున్నాడు. కేవలం 27 సంవత్సరాల వయస్సులో దేశ ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోసం విదేశీ దోపిడీ వ్యతిరేకంగా తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాడు. అమరుడు చంద్రశేఖర్ ఆజాద్ కు జోహార్లు తెలియజేస్తూ, ఆజాద్ స్ఫూర్తితో విద్యార్థులు, యువకులు

ప్రజలపై జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిడిఎస్యూ- పివైఎల్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు జీ. గోవర్ధన్ రెడ్డి, పి.తిరుమలేష్, లొట్టి గోవిందు, నాయకులు జె.అనిల్, డీ.రవి, రంజిత్, అంజి, యం.అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఎడమ కాలువ కు సాగు, త్రాగు నీటిని వెంటనే విడుదల చేయాలని

## – సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు



నేరేడుచర్ల, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లో సుమారు రూ.1,50,000/- ఎకరాల భూమి వరి నాట్లు వేశారని, అవి బోర్లు, బావుల ద్వారా రైతులు నాటు వేయడం జరిగిందని, ప్రస్తుత తరుణంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు బావులు ఎండిపోయాయని తీరా పంట చేతికి వచ్చే దశలో పొలాలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం రైతన్నల మీద కనికరం చూపి వెంటనే సాగర్ ఎడమ కాలువకు 15 రోజులపాటు నీరు వదిలి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడి రైతులను ఆదుకోవాలన్నారు. పరిస్థితి ఇట్లాగే కొనసాగితే రానున్న కాలంలో తాగునీరు కి ఎద్దడి వచ్చి ప్రజలకు పశువులకు త్రాగే నీరు దొరికే పరిస్థితి ఉండదన్నారు. సాగర్ ఎడమ కాలువ 15 రోజులు వదిలితే భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని కనీసం తాగునీటి ఎద్దడి లేకుండా చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి కోదమగుండ్ల నగేష్, కందగట్ల అనంత ప్రకాష్, ఎడ్ల సైదులు, కుంకు తిరుపతయ్య, మొగిలిచర్ల రుద్రమ్మ, నీలా రామ్మూర్తి, శీను, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





టేక్మాల్, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): మెదక్ జిల్లా, టేక్మాల్ మండలం, ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా ఉపాధ్యాయ బాధ్యతలను ఎంతో బాధ్యతతో నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని తెలుసుకుంటారని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలుగా జి శ్రీవర్షిని, డిఇఓ హర్షవర్ధన్, ఎంఈఓ మనోజ్, ఉపాధ్యాయులుగా నిహారిక, అర్చన, వైష్ణవి, ఓం మహేశ్వరి, వాణి, అఖిల బాధ్యతలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, సౌమ్య, జరీనా, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు మంజూరులో జాప్యం చేయడం తగదు

## – రాపోలు నవీన్ కుమార్ సూచన



పాలకవీడు, ఫిబ్రవరి 27(తీన్మార్ న్యూస్): రేషన్ కార్డు మంజూరు చేయడంలో జాప్యం చేయడం తగదని బహుజన్ సమాజ్ పార్టీ హుజుర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాపోలు నవీన్ కుమార్ ప్రభుత్వానికి సూచన చేశారు.

నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల అమలుకు రేషన్ కార్డు ఉంటేనే అర్హులని ఒకపక్క ప్రకటిస్తూ నూతనంగా రేషన్ కార్డు ఇవ్వడంలో జాప్యం చేయడం తగదని, గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఒక్కరి కి కూడా రేషన్ కార్డు ఇవ్వకపోవడం వల్ల గత 10 ఏళ్లలో నూతనంగా వివాహం చేసుకున్న వారికి, కొత్త రేషన్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ అందిస్తున్న ఆరు గ్యారెంటీలకు అనర్హులుగా నిస్సహాయ స్థితిలో ఉన్నారని, నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, అట్టడుగు వర్గాలైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు అగ్రవర్ణాలలోని నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే తక్షణమే కొత్త రేషన్ కార్డులు అందించాలని లేదా రేషన్ కార్డు తప్పనిసరి అనే మెలిక తీసివేయాలని అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని, లేకపోతే ఓట్ల కోసం ప్రజలను బురిడీ కొట్టిన ప్రభుత్వ గా చరిత్రలో మిగిలిపోతారని ఆయన అన్నారు. అధికారం వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలుకు ప్రయత్నం చేయడం అభినంద నీయమే అయినా రేషన్ కార్డు ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేయడం తగదని ఆయన హితవు పలికారు.

# సింగరేణి కార్మికులకు నజరానా

**- బీఆరెస్ పాలనలో నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ**
**- రూ. 6వేల కోట్ల నుంచి రూ.7 లక్షల కోట్లకు అప్పులు**
**- ఆర్థిక నియంత్రణ పాటిస్తూ, అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నాం**
**- మోడీ మూడోసారి పీఎం అయితే రైతులను కాల్చి చంపుతారు**
**- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలి?: ఉచిత బీమా ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్: "తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులు కీలకపాత్ర పోషించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సింగరేణి కార్మికులు నిర్లక్ష్యానికి గురయ్యారు. సంస్థను ప్రయివేటుపరం చేయడాన్ని బీఆరెస్ అడ్డుకోకపోగా ప్రోత్సహించింది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం సచివాలయంలో సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా పథకాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిగరేణి ఎమ్‌డీ బలరాం, యూనియన్ బ్యాంక్ ప్రతినిధి కారె భాస్కర్ రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారిగా సింగరేణి కార్మికులకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు బీమాను వర్తింప జేయనున్నట్టు తెలిపారు. గత సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. "పదేండ్లలో వందేండ్ల విధ్వంసం జరిగింది. బీఆరెస్ పాలనలో నీళ్ల ముసుగులో నిధుల దోపిడీ జరిగింది. 2014లో రూ.72 వేల కోట్ల అప్పులుంటే పదెండ్ల బీఆర్ఎస్ హయాంలో రూ.7 లక్షల కోట్లకు చేర్చారు. ఏటా రూ.6 వేల కోట్లు చెల్లించాల్సిన అప్పులను రూ.70 వేల కోట్లకు చేర్చారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి సర్కారు తిరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది" సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు సృష్టించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, పేదలకు ఉపయోగపడే పనులు చేస్తూ ముందుకెళు తున్నామని చెప్పారు. అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా తమ ప్రభుత్వం చేస్తున్న పనులను అభినందించాల్సింది పోయి కేసీఆర్, కేటీఆర్, హరీష్ అబద్దాలు చెబుతున్నారని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం తప్పిదాలకు గత పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలపై హరీష్ రావు మళ్లీ అవే అబద్దాలు చెబుతున్నారని ఆరోపించారు. 2014, 2018, మ్యానిఫెస్టోల్లో ప్రజలకిచ్చిన హామీలపై బీఆర్ఎస్ బీజేపీ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మూడోసారి మోడీని ప్రధాని చేస్తే ఏం చేస్తారు? రైతులను కాల్చి చంపుతారా? అంటూ ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ఉండి తెలంగాణ కు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని నిలదీసారు. హైదరాబాద్ లో వరదలు వచ్చినపుడు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. రెండు పార్టీలకు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కులేదని అన్నారు. 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలిచ్చి నిరుద్యోగులకు భరోసా కల్పించామని చెప్పారు. మార్చి 2న మరో 6వేల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని ప్రకటించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారి కోసం నియోజక వర్గానికొకటి చొప్పున అంబేద్కర్ నాలెడ్జి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రమాద బీమా ముఖ్యాంశాలు

1) ఉద్యోగుల జీతంతో సంబంధం లేకుండా కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సదుపాయం

2). యూనియన్ బ్యాంక్ డెబిట్ కార్డును నెలలో ఒక్కసారైనా వాడటం ద్వారా అదనంగా 15 లక్షల రూపాయల బీమా ప్రయోజనం.

3). ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా రూ. 1 కోటి 15 లక్షల ప్రమాద బీమా సదుపాయం సింగరేణి ఉద్యోగులకు అందుతుంది.

4). అగ్ని ప్రమాదం జరిగి ప్లాస్టిక్ సర్జరీ లాంటి ట్రీట్‌మెంట్ అవసరమైతే రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం.

5). ప్రమాదంలో మరణించిన ఉద్యోగి మృతదేహాన్ని తరలించేందుకు రూ. 20 వేల ఆర్థిక సహాయం

6). ప్రమాదంలో ఉద్యోగి చనిపోయే సమయానికి గ్రాడ్యుయేషన్ చదివే పిల్లలు ఉన్నట్లయితే రూ.6 లక్షల ఆర్థిక సాయం.

7). ఎయిర్ అంబులెన్స్ అవసరమైతే 6 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం.

8). ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఇద్దరు కుటుంబ సభ్యులు వెళ్లడానికి వీలుగా రవాణా ఖర్చుకింద రూ.20 వేల ఆర్థిక సాయం.

9). అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే ఏడాదిలో రూ. 15 వేల వరకు ఇన్ పేషెంట్ కవరేజ్ సదుపాయం.

10). విదేశీ విద్యకోసం తీసుకునే రూ. 75 లక్షలకు పైగా రుణాలపై 0:10 శాతం రాయితీ.

11) కుటుంబ సభ్యులు ముగ్గురు (జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలు) జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచేందుకు అవకాశం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాలరీ ప్యాకేజీ కలిగిన సింగరేణి ఉద్యోగులందరికీ ఈ బీమా వర్తిస్తుంది. ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత పింఛన్ ఖాతాను యూనియన్ బ్యాంకులోనే కొనసాగించడం ద్వారా 70 ఏళ్ల వరకు ఈ బీమా సదుపాయాన్ని పొందొచ్చు.

# కల్తీ లేని ఆహారం కావాలి

**- పార్టీలు ఆ మేరకు హామీ ఇవ్వాలి : ఎఫ్‌జీజీ యం.పద్మనాభరెడ్డి,**



హైదరాబాద్: ప్రజలందరికీ కల్తీ లేని ఆహారాన్ని అందిస్తామంటూ అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) అధ్యక్షులు యం.పద్మనాభరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆహారపదార్థాల కల్తీ పెరిగి ప్రజలు జీర్ణకోశం పాడవడం, చూపు మందగించడం, కీళ్ల నొప్పులు, క్యాన్సర్, గుండెనొప్పి, పక్షవాతం వంటి దీర్ఘకాలిక రోగాలకు గురవుతూ చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1954లో ఆహార కల్తీ నిరోధక చట్టం వచ్చినా పటిష్టంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మిస్ బ్రాండెడ్, సబ్ స్టాండర్డ్ నిల్వ చేయడం, అమ్మడం నేరమనీ, అదే విధంగా అంటు వ్యాధులతో బాధపడుతున్న వారిని పనిలో పెట్టుకోకూడదని తెలిపారు. కల్తీని గుర్తించడంలో ప్రజలు ఆసక్తి చూపకపోవడం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రత పెరిగిందని చెప్పారు. దేశంలోని 19 పట్టణాల్లో ఆహార కల్తీపై సర్వే చేస్తే 246 కేసులతో దేశంలోనే అత్యధిక ఆహారకల్తీ నగరంగా హైదరాబాద్ నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం 30 మంది ఫుడ్ సేఫ్టీ అధికారులు పని చేస్తున్నారని చెప్పారు. కోట్లాది రూపాయలు ఆదాయాన్ని సంపాదించుకునే హొటళ్లకు కొన్ని వేల రూపాయలు మాత్రమే జరిమానా విధిస్తున్నారనీ, దాన్ని పెంచాల్సిన అవసరముందన్నారు.

డాక్టర్ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ గత పదేండ్లలో ఆహారకల్తీ కేసులు భారీగా పెరిగాయని తెలిపారు. ఒక మనిషి 35 -50 ఏండ్ల మధ్య బతికితేనే తర్వాత కాలం బతుకుతారని డాక్టర్లు చర్చించుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. కల్తీ ఆహారం కారణంగా రకరకాల క్యాన్సర్లు వస్తున్నాయని తెలిపారు. డాక్టర్ ఎన్.కిషన్ మాట్లాడుతూ, కోవిడ్ తర్వాత ఆహార సంబంధిత వ్యాధులు 20 నుంచి 25 శాతం పెరిగాయన్నారు. కరోనా కాలంలో దెబ్బతిన్న వ్యాపారులు ఆ తర్వాత లాభాలే లక్ష్యంగా ఇష్టానుసారంగా కల్తీ చేస్తున్నారని తెలిపారు. ఆహార నిపుణురాలు ఆచార్య విజయఖాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో చాలినంత మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ల్యాబరేటరీలు లేవని విమర్శించారు. కల్తీ చేసిన వారిపై పెద్దగా కేసులు, కఠినంగా శిక్షలు లేకపోవడం కూడా సమస్యను పెంచుతున్నదని వివరించారు. న్యాయవాది శ్రావ్య కట్టా మాట్లాడుతూ కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్యులు, వినియోగదారులు తెలుసుకోలేనంతగా అమ్మకందారులు ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నారని తెలిపారు. హైటెన్ ఇన్నోవేషన్ సొల్యూ,న్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి జె.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పండ్లకు, ముఖ్యంగా మామిడి పండ్లకు ఇష్టానుసారంగా కార్బైడ్ వాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుమతించిన ప్రమాణాల్లో సహజ, టాక్సిక్ లేని రిఫైనర్ ఎన్ రైప్‌ను తాము ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. ఫుడ్ కంట్రోలర్ డిప్యూటీ డైరెక్టర్ విజరు కుమార్ మాట్లాడుతూ ఆహారంలో కల్తీ చేస్తున్నట్టు అనుమానం ఉంటే 91001 05795కి వాట్సప్ మెసేజ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆహార కల్తీ నిరోధానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**
**- రేపటినుంచి పరీక్షలు ప్రారంభం హాజరుకానున్న 9,80,978 మంది విద్యార్థులు**
**- 1,521 పరీక్షా కేంద్రాల ఏర్పాటు**
**- 27,900 మంది ఇన్విజిలేటర్ల నియామకం**
**- విద్యార్థులు ఒత్తిడికి లోనైతే టెలీమానస్ ద్వారా కౌన్సిలింగ్ : ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా**



హైదరాబాద్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 19 వరకు జరిగే ఈ పరీక్షలను ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉండదు. ఈ పరీక్షల నిర్వహణ కోసం ఇంటర్ బోర్డు అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది కలిపి మొత్తం 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ద్వితీయ సంవత్సరంలో 4,44,189 మంది రెగ్యులర్, 58,071 మంది ప్రయివేటు విద్యార్థులు న్నారు. రాష్ట్రంలో 1,521 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 407, ప్రభుత్వ రంగ కాలేజీలు 234, ప్రయివేటు జూనియర్ కాలేజీలు 880 ఉన్నాయి. రాష్ట్రంలో 1,521 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 1,521 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీవో), 27,900 మంది ఇన్విజిలేటర్లు, 75 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఇంటర్ బోర్డు నియమించింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడి, భయాందోళనలకు లోనుకాకుండా ఉండాలని కోరారు. ప్రశాంతంగా పరీక్షలను రాయాలనీ, విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలతోపాటు అధ్యాపకులు, తల్లి దండ్రులపై ఉందన్నారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలుంటే టెలీమానస్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తామని వివరిం చారు. టోల్‌ఫ్రీ నెంబర్ 14416 లేదా 1800-914416 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు 475 మంది ఫోన్ చేశారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వసతుల కల్పన పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామనీ, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించామని శృతి ఓజా చెప్పారు. తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు సకాలంలో చేరేందుకు వీలుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసి అధికారులను కోరారు. పరీక్షల నిర్వహణ సమయంలో తలెత్తే సమస్యలకు సత్వర పరిష్కారం లభించే విధంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిం చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు సమర్థవంతంగా, పారదర్శకంగా, ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యుత్‌కు ఆటంకం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించామని చెప్పారు. ఈ సమావేశంలో ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయి, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రజాసంబంధాల అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతను కాపాడాలి

**- ఎస్వీకే నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు బైకు ర్యాలీ**



హైదరాబాద్: ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నుంచి మన దేశం వెంటనే బయటకు రావాలని సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్కేఎం), కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానుద్దేశించి ఎస్కేఎమ్ రాష్ట్ర కన్వీనర్లు తీగల సాగర్, వి.ప్రభాకర్, ఆర్.వెంకట్రాములు, జక్కుల వెంకటయ్య, డేవిడ్, కార్మిక సంఘాల నాయకులు భూపాల్, ఎస్ఎల్ పద్మ, ఎం.శ్రీనివాస్, అరుణ, మహిళా సంఘం నాయకులు ఝాన్సీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. అబుదాబీలో డబ్ల్యూటీవో కాన్ఫరెన్స్ సోమవారం ప్రారంభమైందన్నారు. మన రైతులకు ఎమ్ఎస్‌పీ మంజూరు చేయొద్దనీ, రైతులకిస్తున్న సబ్సిడీలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై డబ్ల్యూటీవో ఒత్తిడి చేస్తున్నదని విమర్శించారు. ప్రజలకు నేరుగా డబ్బులు బదిలీ చేయాలని ఒత్తిడి చేయడమంటే ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనన్నారు. డబ్ల్యూటీవో ప్రతిపాదనలు రైతులకు, పేద ప్రజలకు, ఆహార భద్రతకు, భారతదేశ సార్వభౌమత్వానికి హానికరమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూటీఓ నుంచి వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు ఉద్యమంలో చీలికలు తేవడానికి కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. పోలీసుల కాల్పుల్లో చనిపోయిన రైతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలనీ, ట్రాక్టర్ల మర్మత్తుల ఖర్చులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్చి 14న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులను చైతన్యపరిచేందుకు పల్లెపల్లెనా పాదయాత్రలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతరంగా రైతు పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సోమన్న, కిషన్ (సీఐటీయూ), యం.హన్మేష్ (ఐఎఫ్‌టీయూ), మూడ్ శోభన్ ( రైతు సంఘం), బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ(వ్యవసాయ కార్మిక సంఘం), ఆర్.శ్రీరామ్ నాయక్, యం. ధర్మానాయక్(గిరిజన సంఘం), స్వరూప, వరలక్ష్మి, లక్ష్మి బాయి, పుష్ప(పీఓడబ్ల్యూ), కోట రమేష్, జావెద్ (డివైఎఫ్ఐ), కేఎస్‌ప్రదీప్ (పీవైఎల్), తాళ్ళ నాగరాజు, అశోక్ రెడ్డి, లెనిన్ గువేరా (ఎస్ఎఫ్ఐ) ఎస్.నాగేశ్వరావు, మహేష్, అనిల్ (పీడీఎస్‌యూ)తదితరులు పాల్గొన్నారు.

# రాడిసన్ డ్రగ్స్ కేసులో అడ్డంగా బుక్కైన సినీ నటులు

హైదరాబాద్: రాడిసన్ హొటల్ డ్రగ్స్ కేసు లో పలువురు సెలబ్రేటిలపై కేసు నమోదైంది. సినీ నటి లిషి గణేష్, శ్వేత పేర్లను పోలీసులు ఎఫ్ఐఆర్ లో చేర్చారు. డ్రగ్స్ పార్టీకి లిషి గణేష్ వెళ్లినట్లు గుర్తించారు. ఎఫ్ఐఆర్‌లో ఆమెతోపాటు మరో సెలబ్రేటి శ్వేతా పేరును కూడా నమోదు చేశారు. గతంలో లిషి గణేష్ సోదరి కూడా డ్రగ్స్ వాడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యూట్యూబర్స్‌గా లిషిగణేష్, సుసితా ఫేమస్ అయ్యారు. లిషిగణేష్‌ను కూడా పిలిచి విచారిస్తామని పోలీసులు చెబుతున్నారు.

అసలేం జరిగిందంటే.. గచ్చిబౌలి లో డ్రగ్స్ కలకలం రేగింది. గచ్చిబౌలిలోని రాడిసన్ హొటల్‌లో డ్రగ్స్ తీసుకున్న కొందరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాడిసన్ హొటల్ లో సదరు యువకులు గ్రాండ్‌గా పార్టీ చేసుకున్నారు. వారిలో ఒక ప్రముఖ బీజేపీ నేత కుమారుడితో పాటు వ్యాపారవేత్త కుమారుడు కూడా ఉన్నాడు. ఈ పార్టీలో డ్రగ్స్, మద్యం ఏరులై పారినట్టు తెలుస్తోంది. యువకులు పెద్ద ఎత్తున డ్రగ్స్ తీసుకున్నారు. పోలీసులు పక్కా సమాచారంతో రాడిసన్ హొటల్‌పై దాడి చేశారు. డ్రగ్స్ తీసుకున్నట్టు గుర్తించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పెద్ద మొత్తంలో కొకైన్ స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన వారిలో ప్రముఖ వ్యాపారవేత్తతో పాటు బీజేపీ నేత కుమారుడు కూడా ఉన్నారు. 2009లో శేరిలింగంపల్లి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన యోగానంద్ కుమారుడు వివేకానంద రాడిసన్ హొటల్‌లో డ్రగ్స్ తీసుకుని పట్టుబడ్డాడు. హొటల్ కూడా యోగానంద్‌దేనని తెలుస్తోంది. మూడు రోజులుగా ఈ ముగ్గురూ పార్టీ చేసుకుంటున్నట్టు సమాచారం. ముగ్గురు యువకులనూ పోలీసులు విచారిస్తున్నారు.

# సైకాలజిస్ట్ కౌన్సిల్ వెంటనే ఏర్పాటు చేయాలి




హిమాయత్‌నగర్: సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనా రాయణరెడ్డి భవన్ లో గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల సైకాలజిస్ట్ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు అయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సైకాలజిస్టులు సంఘటితంగా పోరాటం చేస్తే ఇది అసాధ్య మేమి కాదన్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా ఇమాం పట్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరిగిన వరుస ఆత్మహత్యల నేపథ్యంలో విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావాన్ని, పరీక్షల ఒత్తిడిని తగ్గించి వారిలో మానసిక ప్రశాంతతను అందించుటకుగాను సైకాలజిస్టుల అవసరం ఎంతైనా ఉందని, కావున వెంటనే సైకాలజిస్టుల నియామ కంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రతీ సైకాలజిస్ట్ నాయకత్వ లక్షణాలతో ఒక శక్తిగా ఎదగాలని ఇందుకు సంఘానికి దిన చర్యలో కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. ఇది మీ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. సమజాంలో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులపై వెంటనే ప్రతీ సైకాలజిస్ట్ స్పందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి శ్రీపూజ, కార్యదర్శి సుధాకర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.శర్మిల కున్ను, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆలీయా పర్వీన్, నాయకులు శ్రీదేవి, వైదేహి దలాల్, ఉమర్ ఖాన్, విజయరాణి, వైష్ణవి, డా.లావణ్య, అనితా పగిడిపాటి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంక్షేమం లో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



రామన్నపేట మండలం జనం పెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చలమల్ల లింగారెడ్డి గారి ఆధ్వర్యంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పార్టీలో చేరిన వారిలో యాదవ సంఘం అధ్యక్షురాలు గోగు పద్మ వెంకటేశ్వర్లు యాదవ్, ఉపాధ్యక్షులు ఎర్రబోయిన కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి పండుగ స్వామి, డైరెక్టర్లు గోగు మాధవి శ్రీశైలం యాదవ్, పండుగ స్వామి, ఎర్రబోయిన కిష్టయ్య, మనసాని నరసింహ, వారి వెంట ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లపు రాములు, మాజీ ఎంపీటీసీ బండ పద్మ దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంగిశెట్టి సుదర్శన్, వంగాల గోపాల్, పబ్బు వెంకటేష్, రేఖ సైదులు, వంగాల ఉపేందర్, ఆగు సత్యనారాయణ, అక్కనపల్లి నగేష్, బొంత మల్లేష్, పోచబోయిన చిన్న నరసింహ, బట్టు నరసింహ, ఆగు ఎల్లయ్య, ఆగు మల్లికార్జున్, మెడబోయిన కృష్ణ, వంగాల రవి, సోషల్ మీడియా అధ్యక్షుడు గట్టు కృష్ణ, తదితరులు ఉన్నారు.

# రైతు బంధు, రైతుబీమా పేరుతో దోపిడి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 : రైతుబంధు, రైతు బీమా పథకం డబ్బులు పక్కదారి పడుతున్నట్లు వస్తున్న వార్తలు తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారింది. దీంతో ఈ వ్యవహారంపై పోలీసులు నిఘా పెట్టారు. నకిలీ పత్రాలతో రైతు బంధు,రైతు భీమా డబ్బులు కాజేస్తున్నారని రంగారెడ్డి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత కొన్నేళ్ళ నుంచి రైతుబంధు, బీమా డబ్బులను నిందితులు విత్ డ్రా చేసుకొని తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లు వెలుగులోకి రావడంతో అధికారులు షాక్ తిన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి..... నకిలీ వ్యక్తుల పేర్లతో డబ్బులు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. భూములు లేకపోయినా ఉన్నట్లుగా సృష్టించి..... రైతుబంధు,రైతు బీమా పథకాలు డబ్బులను తీసుకున్నట్టు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. అయితే దీనిపై సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ఫిర్యాదుతో రైతుబంధు, రైతు భీమా మీద పథకం డబ్బులు కొట్టేసినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో 20 రైతు భీమా క్లెయిమ్ లు జరిగినట్లు వెల్లడించారు. అయితే ఈ 20 క్లెయిమ్స్ అనుమానాస్పదంగా ఉన్నాయని అగ్రికల్చర్ ఆఫీసర్ తమతో చెప్పినట్లు సీపీ పేర్కొన్నారు. ఈ 20 రైతు భీమా క్లెయిమ్స్ ద్వారా సుమారు రూ.కోటి రూపాయల ఎల్ఐసి అమౌంట్ రైతు భీమా కింద డైవర్ట్ చేసినట్లు అవినాష్ మహంతి వెల్లడించారు. సుమారు 130 నకిలీ పట్టాధారులను సృష్టించి రైతు బంధు స్కీం లో క్లెయిమ్ చేశారన్నారు. ఇందులో కొంత మంది అప్పటికే మరణించి ఉన్నారని సంచలన విషయాలు భయట పెట్టారు.

కందుకూరు మండల పోలీస్ స్టేషన్లో ఏఈఓ గోరటి శ్రీశైలం తో పాటు వీర స్వామిని అరెస్ట్ చేశామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. 2000 మంది రైతులకు దక్కాల్సిన రైతు బంధు, రైతు భీమా డబ్బును మల్లించి...? డెత్ సర్టిఫికెట్ లో పైన కింద ఒరిజినల్ అని ఉంటుందనీ..... కానీ మధ్యలో ఉండే పేర్లు, ఇతర వివరాలను ఏఈఓ శ్రీశైలం మార్ఫింగ్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ డబ్బుతో ఏ ఈ ఓ శ్రీశైలం వ్యవసాయ భూమిని కొనుగోలు చేసినట్లు అవినాష్ మహంతి తెలిపారు. తన బంధువులు, ఇతర కుటుంబ సభ్యులకు భూములు ఉన్నాయని తనకు మాత్రమే లేకపోవడంతోనే ఇలా చేసినట్లు నిందుతుడు శ్రీశైలం ఒప్పుకున్నట్లు సీపీ పేర్కొన్నారుఏకంగా 2000 మంది రైతులకు సంబంధించిన రైతు బంధు,రైతు భిమను శ్రీశైలం మరియు వీర స్వామి గత కొన్నాళ్లుగా కానేస్తునట్లు చెప్పుకొచ్చారు. రైతులు రైతు బంధు,భీమా పథకాల డబ్బు గురించి నిలదీసిన ప్రతీ సారి ఏదో ఒక సాకు చెప్పే వాడని సీపీ వివరించారు. వీరస్వామితో ఏడు బ్యాంక్ అకౌంట్లు ,జాతీయ బ్యాంకులలో ఎకౌంట్లు క్రియేట్ చేశాడని.....ఏటీఎం బ్యాంక్ పాస్ బుక్ లు మాత్రం తన వద్దే పెట్టుకునే వాడని తెలిపారు. ఏఈఓ అక్రమంగా కొనుగోలు చేసిన భూమిని,ఇతర ఆస్తులను,నగదును ఏసీబీకి అప్పగిస్తామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు.

టెలిగ్రామ్ యాప్ లో పరిచయం,

పెట్టుబడి పేరుతో రూ.50 లక్షలు మోసం

ఇటీవల పెట్టుబడి పేరుతో ఓ మహిళ నుంచి రూ.50 లక్షలు కొట్టేశారు సైబర్ కేటుగాళ్లు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. దుబాయ్ లో నుంచి ఓ వ్యక్తి స్థానికంగా ఇద్దరు వ్యక్తులతో ఈ దందా నడిపించినట్లు గుర్తించారు. సామాజిక మధ్యమల ద్వారా పెట్టుబడుల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

నగరానికి చెందిన ఓ మహిళకు టెలిగ్రామ్ యాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు తాము సూచించిన యాప్ లలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ఆమెకు వాటికి సంబంధించిన లింకులు పంపి సదరు మహిళ నుంచి పలు దఫాలుగా రూ.49,45,900 లను కాజేసి ఆమెను మోసం చేశారు. దీంతో బాధిత మహిళా గతంలోనే హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..... కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసులో అకౌంట్ హోల్డర్స్ గా ఉన్న జానీ, ఇమాన్యుల్ అనే ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.




# 'కేజీ టు పీజీ' పేరుతో కార్పొరేట్‌కు ప్రాధాన్యత

**– విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తాం**
**– తీ2 లక్షల ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉన్నాం**
**– ధరణి సమస్యల పరిష్కారానికి సదస్సులు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**
**– కాళేశ్వరం పూర్తి వివరాలు ప్రజల ముందు ఉంచుతాం: ప్రొ.కోదండరామ్**



గత ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య అంటూ కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉందని చెప్పారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల సోషియాలజీ (సామాజికశాస్త్రం) విభాగం హెడ్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చింత గణేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా "తెలంగాణ పునర్ నిర్మాణం–అభివృద్ధి దృక్ప థాలు" అంశంపై మూడ్రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, ప్రజలు ఎంతో పోరాడారని, దాని ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. కానీ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వారి కలలను గులాబీ పెద్దలు కలలుగానే మిగిల్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేసి సామాన్య ప్రజలకు మంచి చేస్తామని చేసిన హామీ ప్రకారం అసెంబ్లీ సాక్షిగా కులగణన బిల్లును ఆమోదింపచేసుకున్నామని చెప్పారు. టీఎస్పీఎస్సీని కూడా ప్రక్షాళన చేశామన్నారు. ఇప్పటికే 19 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 2లక్షల ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఆశించిన విధంగా ఉద్యోగ, ఉపాధి, విద్య అందిస్తామన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులు, రైతు కూలీల కు ఉన్న ఐదు గుంటలు, పది గుంటలు భూమి కూడా సమస్యలోకి నెట్టబడిందన్నారు. ప్రభుత్వ భూములను వారి సొంత భూములుగా మార్చుకోవడానికి కుట్రపూరితంగా ధరణిని ప్రవేశపెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వ పెద్దలు ఎన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసారో, ఎన్ని లక్షల కోట్ల ప్రజల సొత్తును కొల్లగొట్టారో త్వరలో ప్రజలముందు పెట్టబోతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖ, ధరణికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఎమ్మార్వో స్థాయిలో సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రపంచ అద్భుతం నేడు కుప్ప కూలిపోతుందని..గత ప్రభుత్వ అవినీతికి కాళేశ్వరం ఒక నిదర్శనమని అన్నారు. యూనివర్సిటీ లలో ఖాళీలను భర్తీ చేస్తామని, ఉస్మానియా యూనివర్సిటీ సమస్యలను త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రొ.కోదండరామ్ మాట్లాడుతూ.. 6 గ్యారంటీల తో పాటుగా 7వ గ్యారంటీ అయిన రాజ్యాంగ భద్రత కాం గ్రెస్ లక్ష్యంగా చెప్పారు. కాళేశ్వరం అవినీతిపై మంత్రు లతో చర్చించి పూర్తి వివరాలు ప్రజల ముందుంచుతామన్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఇకపై నూతన మార్పులు చేర్పులు చేస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొ.చింత గణేష్ సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్, సోషల్ సైన్స్ డీన్ అర్జునరావు కుతాడి, ప్రొ.పి.విష్ణుదేవ్, డా.రాంషెఫర్డ్ భీనవేని, డా.టి .శ్రీధర్ డా. వినిత్ పాండే, ప్రొ.సత్యనారాయణ, ప్రొ.చెన్న బసవయ్య, డా.రామచంద్ర మూర్తి, డా.కవిత షిండే ప్రసంగించారు.

# డీఎస్సీ-2008 మెరిట్ అభ్యర్థులకు నియామకాలు చేపట్టాలి

హైదరాబాద్: హైకోర్టు తీర్పు ప్రకారం డీఎస్సీ–2008 ఎంపికైన బీఈడీ మెరిట్ అభ్యర్థులను సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమాకాలను చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన సోమవారం లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ–2008 నోటిఫికేషన్ ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో బీఈడీ, డీఈడీ అభ్యర్థులకు నాటి ప్రభుత్వం సమాన అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. నోటిఫికేషన్ విడుదలైన 54 రోజుల తర్వాత జీవో నెంబర్ 28 ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో డీఈడీ అభ్యర్థులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల కామన్ మెరిట్‌లో ఎంపికైన బీఈడీ అభ్యర్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 28 జీవో వల్ల నష్టపోయిన బీఈడీ మెరిట్ అభ్యర్థులకు 39 జీవో ద్వారా ఏపీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందని వివరించారు. అదే విధంగా తెలంగాణలోని అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలను ఆరు వారాల్లో పూర్తి చేయాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. దాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖాధికారులకు తగిన ఆదేశాలివ్వాలని సీఎంను కోరారు.



# ఇక నుంచి ఏటా రెండు సార్లు 'టెట్'

**– జూన్, డిసెంబర్‌లో నిర్వహణ**



హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయ అభ్యర్థులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఇకనుంచి ఏటా రెండుసార్లు నిర్వహించాలనీ, రాష్ట్ర ప్రభుత్వం జూన్, డిసెంబర్ నెలల్లో ఆ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే అందుకు సంబంధించిన దస్త్రంపై సంతకం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇకనుంచి డీఎస్సీ నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ఏటా రెండుసార్లు టెట్‌ను విద్యాశాఖ నిర్వహించనుంది. టెట్ నిర్వహణకు 90 రోజుల సమయం పట్టనుండగా, అంతకు ముందే నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నాయి. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం ఏటా రెండుసార్లు టెట్‌ను నిర్వహించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా టెట్ గడువును ఏడేండ్ల నుంచి జీవిత కాలానికి పొడిగించింది. గతంలో అర్హత పొంది మార్కులను పెంచుకోవాలనుకునే వారు, ఇటీవలి కాలంలో బీఈడీ, డీఐఈడీ వంటి కోర్సులను పూర్తిచేసిన వారు మాత్రమే టెట్ రాసేవారు.

కానీ ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు పేపర్–2లో అర్హత కావాలన్న నిబంధనను తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నది. దీంతో ఇక నుంచి ఉపాధ్యాయ ఉద్యోగ కోసం ఎదురుచూసే వారే కాకుండా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు కూడా టెట్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీంతో టెట్‌కు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో గతేడాది ఆగస్టు ఒకటిన టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 15న రాతపరీక్షలను నిర్వహించారు. అదేనెల 27న ఫలితాలను విడుదల చేశారు. టెట్ పేపర్–1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,23,582 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 82,489 (36.89 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. పేపర్–2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,90,047 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 29,073 (15.30 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారు. ఇందులో మ్యాథ్స్, సైన్స్ విభాగానికి 1,01,134 మంది హాజరుకాగా, 18,874 (18.66 శాతం) మంది పాసయ్యారు. సోషల్ స్టడీస్ విభాగానికి 88,913 మంది 10,199 (11.47 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

# రైతులపై మోడీ ప్రభుత్వ దమన నీతి

**– సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**



హైదరాబాద్: మోడీ ప్రభుత్వం రైతులపై దమననీతిని కొనసాగిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. అన్నదాతలపై నిరంకుశ ధోరణులను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆ పార్టీ ఆధ్వర్యం లో తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ తమ పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులను మోడీ సర్కార్ క్రూరంగా అణచివేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుల బాధల పట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పంజాబ్–హర్యానా సరిహద్దుల్లో నిరసన తెలుపు తున్న వారిపై జరిగిన పోలీస్ కాల్పుల్లో శుభకరన్ సింగ్ అనే రైతు మృతి చెందారనీ, ఈ ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోడీ తప్పుడు వాగ్దానాలు చేశారని దుయ్యబట్టారు. వారిని విశ్వాసంలోకి తీసుకోకుండా రైతు వ్యతిరేక చట్టాలను ప్రయోగించి బడా వ్యాపారులకు వ్యవసా యాన్ని అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు.

పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్రం చట్ట పరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించ కుంటే దేశ వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తా మని నారాయణ హెచ్చరించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మోడీ సర్కార్.. రైతులను తీవ్రంగా నష్టపరిచే వివాదాస్పద వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని చెప్పారు. రైతులు మును పెన్నడూ లేని విధంగా కష్టాల్లో కూరుకుపో తున్న నేపథ్యంలో తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన లు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి బాధల పట్ల మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, బాలమల్లేష్, కె శంకర్, ఏఐటీ యూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. డా. కె. నారాయణ తోపాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేణి శంకర్, ఎన్. బలమల్లేష్, ఈ.టి. నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

వీర్నపల్లి: విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జే రమేష్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం పోలిస్ స్టేషన్ లో ఎస్ ఐ జే రమేష్ విలేకరుల సమావేశంలో త్వరలో జరగనున్న ఇంటర్మీడియట్, టెన్త్, డిగ్రీ వార్షిక పరీక్షలు మొదలవుతున్న నేపద్యంలో, విద్యార్థులకు ఇబ్బంది కల్గించే విధంగా మైక్ లలో శబ్దాలు చేస్తే, డి జే లు పెట్టి శబ్ద కాలుష్యం చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్మీడియట్ పిబ్రవరి 28 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి గనుక విద్యార్థులు రాత్రి, పగలు చదువులో నిమగ్నం అయి ఉంటారు,

అన్ని మతాల సంబందించిన ప్రార్థన మందిరాలలో మైక్ లలో శబ్దాలు పెడితే పిల్లల చదువుకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది. పరీక్షలు ముగిసే వరకు లౌడ్ స్పీకర్లు లో శబ్దాలు చెయ్యకూడదు, ఎవరైనా శబ్దకాలుష్యం చేసి విద్యార్థులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . అలాగే 144 సెక్షన్ అమలు లో ఉంటుంది , పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి లో అనవసరంగా ఎవరు ఉండకూడదు, పరీక్ష సెంటర్ కు దగ్గరలో జిరాక్స్ సెంటర్ లు తెరువరాదు. విద్యార్థులు సకాలంలో పరీక్ష సెంటర్ కు చేరుకోవాలనీ తెలిపారు.




# వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

మల్హర్ రావు.: రానున్న వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మండల ఎంపిపి చింతలపల్లి మల్హర్ రావు అధికారులను కోరారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవి తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యల కోసం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన ఎంపిటిసి సభ్యులు, గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మండల ఎంపిడిఓ శ్యాం సుందర్, స్పెషల్ అధికారి అవినాష్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

గ్రామాల్లో ఎక్కువగా మిషన్ భగీరథ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని పంచాయతీ కార్యదర్శులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లుగా ఏఈ హరిత తెలిపారు. గ్రామాల్లో మరమ్మతులు చేస్తే పనికి వచ్చే బోర్ బావులు,చేతి పంపులు ఉంటే చెప్పాలని, మరమ్మతులు చేసిన పనికి రాకుండా ఉన్నవి వదిలేయాలని,జిపి నిధులతో లీకేజీల మరమ్మతులు చేయించాలని ఏఈ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో బోర్,పంపుల మెకానిక్ లేక ఇబ్బందులున్నాయని తెలిపారు. తాగునీటి సమస్యలపై ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఇప్పులపల్లి అంగన్ వాడి కేంద్రం వద్ద సింటెక్స్ ట్యాంకర్ ఏర్పాటు చేయాలని,గ్రామాల్లో ముగజివాల దప్పిక తీర్చడానికి గతంలో నిర్మాణం చెప్పన నీటి తొట్టిలకు మరమ్మతులు చేయాలని వల్లెంకుంట ఎంపిటిసి ఏనుగు నాగరాని కోరారు. దబ్బగట్టులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఒక ట్యాంకర్ తో నీటి సరఫరా సాధ్యం కావడం లేదని మరో ట్యాంకర్ ఏర్పాటు చేయాలని కార్యదర్శి రాజు కోరారు. వల్లెంకుంట గ్రామానికి రెండు హ్యాండ్ పంపులు వేయించాలని కార్యదర్శి నరేశ్ కోరారు. తాడిచెర్లలో సమ్మయ్య పల్లిలో ట్యాంకర్, లీకేజీల, ఉన్నాయని కార్యదర్శి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి కుమార్,ఏఈ అశోక్,వ్యవసాయ అధికారి సుధాకర్,ఎంపిఓ విక్రమ్, స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు



# 'గుప్త నిధి' పేరుతో మోసం.. ముఠా అరెస్టు



కొత్తగూడెం:'గుప్త నిధి నగదు' పేరుతో నకిలీ కరెన్సీని గొర్రెల వ్యాపారులకు అంటగట్టిన ముఠాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర్‌కు చెందిన మానికల కృష్ణ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన రవి, నకిరిపేటకు చెందిన తేజావత్ శివ, బానోత్ నరేశ్, ధరంసోతు శ్రీను, పాల్వంచ మండలం శ్రీనివాసకాలనీకి చెందిన గూడవల్లి ప్రశాంత్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా గుప్త నిధుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారులు బోయిన బుచ్చయ్య, వేల్పుల కిరణ్, కనతి లింగయ్యలను రెణ్నెల్ల క్రితం సంప్రదించారు. తమ వద్ద రూ.40 లక్షల విలువైన గొర్రెల మందలున్నాయని నమ్మబలికారు. తక్కువ ధరకే విక్రయిస్తామని చెప్పారు. దీంతో ఆ వ్యాపారులు నవంబరు మొదటి వారంలో పాల్వంచకు వచ్చి ముఠాను సంప్రదించారు. ప్రస్తుతం గొర్రెలు వేరే దగ్గర ఉన్నాయని, అవి వచ్చాక సమాచారమిస్తామని నిందితులు చెప్పారు. 'ఇంత దూరం వచ్చాక ఇలా చెప్పడం ఏమిటని' సదరు వ్యాపారులు నిలదీయడంతో ఛార్జీలు, ఇతర ఖర్చుల కింద నగదును ఆన్‌లైన్‌లో చెల్లించి మరింత నమ్మించారు. ఈ నెల 9న ఫోన్‌చేసి గొర్రెల మందలు తమ వద్దకు వచ్చాయని మళ్లీ పాల్వంచ రప్పించారు. అక్కడ్నుంచి లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం సమీపంలోని ముర్రేడు వాగు అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఇంతలో నిందితులు అక్కడ్నుంచి జారుకున్నారు. వారు వెళ్లాక 'గుప్త నిధి' నగదును పరిశీలించగా రూ. 500 నకిలీ నోట్ల మధ్య తెల్ల కాగితాలు కనిపించాయి. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు ఈ నెల 13న లక్ష్మీదేవిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ముఠా సభ్యులైన ఆరుగురు పట్టుబడ్డారు. వారిని వెంటనే అరెస్టు చేశారు. ముఠాకు సంబంధించిన సేల్లుల వెంకన్న, లక్ష్మణ్, భూక్యా నాగ, ధరావత్ రవి పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకొంటామని డీఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.30,46,000 నగదు, కారు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ప్రధాన నిందితుడు కృష్ణపై గతంలో కొత్తగూడెం త్రీటౌన్, వీఎం బంజర, దమ్మపేట, ఖమ్మం జిల్లా కూసుమంచి, నల్గొండ జిల్లా తుంగతుర్తి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ ఎ.పెద్దన్న కుమార్, ఎస్సైలు సంతోశ్, రాజమౌళి పాల్గొన్నారు.

# మళ్లీ కరోనా.. పడొద్దు హైరానా!



ఖమ్మం :దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కొవిడ్ వ్యాప్తి చెందుతుందన్న కేంద్రం హెచ్చరికలతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సర్వజన ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సేవలందించేందుకు సన్నద్ధమయ్యారు. భద్రాద్రి జిల్లా సర్వజన ఆసుపత్రిలో 60 ఆక్సిజన్ పడకలను అందుబాటులోకి తీసుకొచ్చారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మరో 30 పడకలను సిద్ధంగా ఉంచారు. ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే మూడు గదుల్లో 18 పడకలను ఏర్పాటు చేశారు. మెరుగైన వైద్యం కోసం ఐదు పడకలతో ఐసీయూ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. వెంటిలేటర్స్-4, సిపాప్ పరికరాలు-4, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు-4 సిద్ధంగా ఉంచారు. కేసుల ఉద్ధృతి పెరిగితే మంచాల సంఖ్యను విస్తరించేందుకు మరికొన్ని వార్డులను గుర్తించారు. అన్నింటిలో సెంట్రల్ ఆక్సిజన్ ప్రొవిజన్ అందుబాటులో ఉండటంతో సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా పైపులైన్లు, మంచాల వద్ద పరికరాలను సాంకేతిక సిబ్బందితో చెక్ చేయించారు. ఆసుపత్రి ప్రాంగణంలో తొలివిడత కొవిడ్ సమయంలో లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకు(ఎల్ఓటీ), పీఎస్ఏ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ యూనిట్ ఏర్పాటు చేశారు. వాటిని సైతం సిద్ధం చేసి ఆక్సిజన్ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వార్డుల్లో సేవలందించేందుకు వైద్యులు, నర్సింగ్, సాంకేతిక, సహాయక, శానిటేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించేందుకు ప్రణాళికలు రచించారు. సర్వజన ఆసుపత్రుల్లో కొవిడ్ నిర్ధారణ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ ర్యాపిడ్ పరీక్షలు జరుపుతున్నారు. గర్భిణులు, వివిధ రకాల చికిత్సలతో ఇన్‌పేషంట్లుగా చేరిన వారిలో లక్షణాలు కనిపించిన రోగులు, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ర్యాపిడ్ పరీక్షలు చేస్తున్నారు. ఆర్‌టీపీసీఆర్ పరీక్షలకు కావాల్సిన రసాయనాలు లేకపోవడంతో ప్రభుత్వానికి నివేదించామని ఖమ్మం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయని, కొవిడ్ నిబంధనలు పాటించాలని అన్నారు. జలుబు, జ్వరం, దగ్గు లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ అమర్‌సింగ్‌తో కలిసి కొవిడ్ వార్డులు, పరీక్షల కేంద్రాన్ని సందర్శించారు.

# సీసీఐ కేంద్రాల్లో రైతుల పడిగాపులు



ఖమ్మం :భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాలు దళారులకు నిలయంగా మారాయి. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనేందుకు కొర్రీలు పెడుతూ నిరాకరిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు తెచ్చిన సరకును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోలు చేస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7,020 కల్పించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ రూ.100 తక్కువకు ఆయా కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు. తల్లాడలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో బుధవారం రైతుల పత్తి కొనుగోలు చేసేందుకు నిరాకరించడంతో అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ కేంద్రానికి బోనకల్లు, కల్లూరు, వైరా, తల్లాడ, ఏన్కూరు, చింతకాని, జూలూరుపాడు తదితర మండలాల నుంచి రైతులు పత్తి తెస్తున్నారు.రైతులు పత్తి పండించినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) దగ్గిరి నుంచి ధ్రువీకరణ పత్రాలు తెస్తున్నారు. సీసీఐ కేంద్రంలో వీరి వివరాలను పరిశీలించిన అధికారులు తమవద్ద ఆన్‌లైన్‌లో ఈ వివరాలు లేవని నిరాకరిస్తున్నారు. వ్యవసాయ అధికారి ధ్రువీకరణ చేసినప్పటికీ వాటి వివరాలు తమ వద్ద లేవని సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదని వాపోతున్నారు. కొనుగోలు చేయకపోవటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. రీ ఏఈఓ లాగిన్‌లో ఉన్న వివరాలు మార్కెటింగ్ అధికారుల వద్ద లేకపోవటంతో నిజంగా పత్తి పండించి కేంద్రాలకు వచ్చిన రైతులకు అన్యాయం జరుగుతోంది. దీంతో చేసేది లేక ప్రైవేటు వ్యాపారులకే తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్నారు.కౌలు రైతుల పరి స్థితి మరీ దారుణంగా ఉంది. ఏఈఓ దగ్గరి నుంచి కౌలు రైతు ధ్రువీకరణ పత్రం ఉంటే కొనుగోలు చేయాలి. కానీ ధ్రువీకరణ పత్రం తెచ్చినప్పటికీ కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. రీ తల్లాడ మండలానికి చెందిన ఓ రైతు ఇటీవల మృతి చెందారు. బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర వివరాలన్నీ ఆయన పేరుతోనే ఉన్నాయి. ఇప్పుడు ఆయన మృతి చెందటంతో కుమారులు పత్తి విక్రయించేందుకు తెస్తున్నారు. కుమారుల పైరుతో వివరాలు లేవని నిరాకరిస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని ఆధారాలుంటే సీసీఐ అధికారులు తప్పని సరిగా పత్తి కొనుగోలు చేయాల్సిందే. కేంద్రాల వద్ద ఇబ్బంది పెడితే సహించేది లేదు. ఎక్కడైనా సాంకేతిక లోపాలుంటే వాటిని సరిచేసి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో కేంద్రాల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ



సూర్యాపేట: జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా పోలీసులు తగిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఎస్పీ రాహెల్ హెగ్డే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ క్రాస్ రోడ్డు, పీఎస్సార్ సెంటర్, పోస్టాఫీస్ చౌరస్తా, కర్నల్ సంతోశ్‌బాబు చౌరస్తాలతోపాటు పట్టణంలోని ఇతర కూడళ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణ సముదాయాలు, మార్కెట్ ప్రాంతాల్లో రద్దీని నియంత్రించి బాటసారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తోపుడు బండ్లు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు పాదబాట దాటి రోడ్లపైకి రావొద్దని కోరారు. బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం, మైనర్లకు వాహనం ఇవ్వడం, సెల్‌ఫోను, రాంగ్ రూట్ డ్రైవింగ్, అధిక శబ్దాలు చేసే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, ట్రాఫిక్ ఎస్సై నవీన్ ఉన్నారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే విజ్ఞప్తి చేశారు. జనవరిలో నిర్వహించనున్న 10వ విడత ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జులైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరికి గురవుతున్న బాలలను సంరక్షించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సూర్యాపేట, కోదాడ సబ్ డివిజన్ల వారీగా బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భరోసా కేంద్రం సిబ్బంది సమన్వయంతో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. మెకానిక్ దుకాణాలు, పరిశ్రమలు, వలస కూలీలు, ఇటుకల తయారీ పరిశ్రమలు, మైన్స్, హోటల్స్, దాబాలు, గోదాములు లాంటి ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. బాలలను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలించడం, తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు వివరించారు. బాలలను వేధింపులకు గురి చేసినా, వెట్టి చాకిరీ చేయిస్తున్నా పోలీసులకు లేదా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# విత్తన దశ లోపాలు అధిగమిస్తేనే హరితం



పెద్దపల్లి :2024-25 సంవత్సరానికి సంబంధించి మొక్కల లక్ష్యాలు ఖరారు చేశారు. ఈ ఏడాదిలో 27.08 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. శాఖల వారీగా లక్ష్యాలు కేటాయించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలు సంచుల్లో మట్టి నింపుతున్నారు. నెలాఖరులోపు విత్తనాలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే నర్సరీల్లో మౌలిక వసతుల కొరత పీడిస్తోంది. నర్సరీల చుట్టూ కంచె లేకపోవడంతో మొక్కలకు రక్షణ కరవైంది. సమస్యలను పరిష్కరిస్తేనే హరితహారం ఆశయం నెరవేరనుంది. జిల్లాలో గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ, నీటిపారుదల, పరిశ్రమలు, ఆర్అండ్‌బీ ఇతరత్రా శాఖలకు లక్ష్యాలు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖ 14.11 లక్షల మొక్కలు నాటాల్సి ఉంది. రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు 4.97 లక్షలు, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం పరిశ్రమలకు 5.35 లక్షలు ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున 9.40 లక్షలు పంపిణీ చేయనున్నారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత ఆయా శాఖలు తీసుకోనున్నాయి. హరితహారంలో నీడ, పండ్లు, ఔషధ మొక్కల పెంపకానికి ప్రాధాన్యమిచ్చారు. టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె ఇలా 16 పలు రకాల విత్తనాలతో పాటు ప్రకృతిలో లభించే మొక్కలు నాటేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రతి ఇంటికి ఒక తులసి మొక్క పంపిణీ చేయనున్నారు. రహదారికి ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, కార్యాలయాల ఆవరణలో విరివిగా నాటనున్నారు. జిల్లాలో 266 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో విత్తనాలు విత్తేందుకు సంచుల్లో మట్టి పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 26 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం ఉండగా 25.10 లక్షల సంచుల్లో మట్టి నింపడం పూర్తయింది. 10 లక్షల సంచుల్లో విత్తనాలు నాటారు. మిగిలిన వాటిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏటా వేసవి ఎండల తీవ్రత కారణంగా మొలక దశలో చనిపోతున్నాయి. నాసిరకమైన విత్తనాలు కొనుగోలు చేయడంతో ఎదుగుదల లేదు. ఒకటికి పలు మార్లు విత్తనాలు నాటడంతో అదనపు ఖర్చవుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# రైసుమిల్లుల్లో ధాన్యం మాయం

## 26 మందికి నోటీసులు



జగిత్యాల,:జగిత్యాల జిల్లాలో రైసుమిల్లర్లు బియ్యమే కాకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. నాలుగైదేళ్లుగా మిల్లర్లపై అనేక ఫిర్యాదులున్నప్పటికి అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహించి చూసీచూడనట్లు వ్యవహరించారు. పౌరసరఫరాల అధికారులు ఇప్పటి వరకు 30 ధాన్యం మిల్లుల్లో తనిఖీలు నిర్వహించగా 26 మిల్లుల్లో సుమారు లక్ష క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. తనిఖీలు నిర్వహించిన 5 మిల్లుల్లోనే ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం కంటే 80,335.06 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలింది. పొలాస లక్ష్మినర్సింహ ఇండస్ట్రీస్‌లో 10375.6 క్వింటాళ్లు, కల్లెడ ఆంజనేయ రైస్‌మిల్లులో 12999.00 క్వింటాళ్లు, కోరుట్ల కొత్త సురేష్ రైస్‌మిల్లులో 33297.00 క్వింటాళ్లు, కోరుట్ల కొత్త సురేష్ ఆగ్రో రైస్‌ఇండస్ట్రీస్‌లో 18480.00, కొత్త శ్రీయాన్ రైస్ ఇండస్ట్రీస్‌లో 5184.00 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ధాన్యం తక్కువగా ఉన్న 26 మిల్లుల యజమానులకు నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో పౌరసరఫరాల అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు ఇస్తుండగా 67 శాతం రా, 68 శాతం బాయిల్డ్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అనేక మంది మిల్లర్లు ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వకపోగా తనిఖీల సందర్భంగా మిల్లుల్లో అటు ధాన్యం ఇటు బియ్యం లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 3 నెలల క్రితం 38 ధాన్యం మిల్లులను డిఫాల్టర్లుగా గుర్తిం చి వారి నుంచి సుమారు రూ.2.12 కోట్ల జరిమానా వసూలు చేయాలని నిర్ణయించగా అందులో 25 మంది నుంచి సుమారు కోటి రూపాయలు రికవరీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతినెలా పౌరసరఫరాల అధికారులతో బియ్యం రికవరీపై సమీక్ష జరుపుతున్నప్పటికి క్షేత్రస్థాయిలో లక్ష్యం మేరకు రికవరీ జరగడం లేదు. గత నెలలో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో బియ్యం ఇవ్వని 6 మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్లలో తీసుకున్న ధాన్యానికి ఇప్పటి వరకు ప్రభుత్వానికి బియ్యం ఇవ్వని మిల్లర్లు కూడా ఉన్నారు. ఆసంవత్సరం వానాకాలం సీజన్‌లో 12 మంది మిల్లర్లు 3084.002 మెట్రిక్ టన్నులు, యాసంగికి సంబంధించి నలుగురు మిల్లర్లు 3063.171 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. గత రెండునెలల్లో జగిత్యాల రైల్వేస్టేషన్ నుంచి 3 వ్యాగన్ల బియ్యాన్ని చెన్నై తరలించారు. అనేక మంది మిల్లర్లు ధాన్యాన్ని సైతం పక్కదారి పట్టించి రేషన్ బియ్యం కొనుగోలు చేసి సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2022-23 వానాకాలం సీజన్‌లో మిల్లర్లకు 3.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. 2.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా గత నెల వరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. ఈనెలాఖరు వరకు వందశాతం బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 60 శాతం బియ్యం ఇచ్చారు. ప్రస్తుతం అధికారుల తనిఖీల నేపథ్యంలో మిల్లర్లల్లో వణుకు మొదలైంది.అన్ని మిల్లులను తనిఖీలు నిర్వహిస్తామని అక్రమాలు జరిగినట్లు తేలితే ఆయా మిల్లర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత పేర్కొన్నారు.

# సామగ్రి కొనుగోలులో కక్కుర్తి



జగిత్యాల :జగిత్యాల పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించే సామగ్రిలో అవినీతి చోటుచేసుకుంటోంది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన బ్లీచింగ్ పౌడర్, దోమలమందు, ఇతర రసాయనాలతోపాటు కార్మికులు వినియోగించే వస్తువుల్లోనూ కార్యాలయ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏటా పారిశుద్ధ్య సామగ్రిని టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తారు. ఇటీవల ఎన్నికల కోడ్‌కు ముందే రూ.5 లక్షలతో 600 బ్లీచింగ్ బ్యాగులు, కెమికల్, సున్నం తదితర సామగ్రి, మరో రూ.5 లక్షలతో తట్టలు, పారలు, చీపుర్లు టెండరు పిలిచి గుత్తేదారు ద్వారా కొనుగోలు చేశారు. సామగ్రి మొత్తం నాసిరకంగా ఉండటంతో వాటిని వినియోగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు విముఖత చూపుతున్నారు. తాజాగా కొనుగోలు చేసిన పారిశుద్ధ్య సామగ్రి ఏమాత్రం నాణ్యతగా లేదు. పేరొందిన కంపెనీల నుంచి కాకుండా గుర్తింపులేని సంస్థల ద్వారా తెప్పించారు. బ్లీచింగ్ పౌడర్ మొత్తం సున్నంలా ఉందని, కెమికల్ నీళ్లలా ఉందని చెబుతున్నారు. వీటిని వినియోగిస్తే ఆయా వార్డుల కౌన్సిలర్ల నుంచే విమర్శలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తట్టలు, పారలు సైతం పూర్తి నాసిరకానికి కొనుగోలు చేశారు. ఇవి వినియోగించకముందే పనికిరాకుండా పోతాయని సిబ్బంది పేర్కొంటున్నారు. 48 వార్డులున్న పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు సామగ్రి ప్రధానం. ఈ నేపథ్యంలో నాణ్యత కొరవడిన సామగ్రి అంటగట్టడంపై కార్మికుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.10 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన సామగ్రిలోనూ కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. టెండరు పొందిన వ్యక్తి ద్వారా సామగ్రిని ఇంజినీరింగ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాల్సి ఉంటుంది.

# స్మార్ట్‌సిటీలో నిర్లక్ష్య ధోరణి

కరీంనగర్ కార్పొరేషన్ : 'స్మార్ట్‌సిటీలో భాగంగా కరీంనగర్ టవర్‌సర్కిల్ ప్రాంతాన్ని అమృత్‌సర్ తరహాలో తీర్చిదిద్దుతాం..' ఆరేళ్ల కిందట ప్రణాళికలు తయారు చేసిన సమయంలో అన్న మాటలివి.. ప్రస్తుతం అక్కడ జరిగిన అభివృద్ధి పనులు చూస్తే మరి దారుణంగా కనిపిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ తవ్వి కుప్పపెట్టడం, టైల్స్ ఊడిపోవడం, రహదారి మరింత ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా తయారైంది. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోని నగర నడిబొడ్డున ఉన్న టవర్‌సర్కిల్ ప్రాంత అభివృద్ధి కోసం రూ.26 కోట్లు కేటాయించారు. ఇందులో రహదారులు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్, విద్యుత్తు దీపాలు, రాత్రిపూట ఆకర్షించేలా ప్రత్యేక లైటింగ్, టైల్స్ వేసి అందంగా మార్చాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తి కాగా మిగతా పనులు వదిలేశారు. పలు చోట్ల మురుగుకాల్వలు, విద్యుత్తు పనులు వంటివి అసంపూర్తిగా ఉన్నాయి. నడకదారి కోసం వేసిన ఫుట్‌పాత్ టైల్స్ పలు చోట్ల పగిలిపోగా, మరికొన్ని చోట్ల ఊడిపోయి చిందరవందరగా మారాయి. విద్యుత్తు తీగల కోసం ఫుట్‌పాత్ టైల్స్ తవ్వారు. ఈ పనులు ముందుగా చేయకపోవడంతో మళ్లీ తవ్వుతుండటంతో ఆ ప్రాంతం అసహ్యంగా మారింది. రోడ్డు మాదిరిగా వేసిన బండరాళ్లు తేలి ప్రమాదకరంగా మారుతున్నాయి. టవర్‌సర్కిల్ చుట్టూ నిత్యం రద్దీగా ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇక్కడికే వస్తారు. అలాంటి ప్రాంతాన్ని వావ్ అనేలా మార్చాల్సి ఉండగా ఇవేం పనులంటూ ముక్కున వేలేసేకులా మారింది. అప్పటి అదనపు పాలనాధికారి గరిమా అగ్రవాల్‌ను ప్రత్యేకంగా నిత్యం పరి శీలించాలని అప్పటి కలెక్టర్ సూచించినా అప్పటి నుంచి ఇప్పటివరకు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. మూడున్నర సంవత్సరాలుగా కొలిక్కి రావడం లేదు. టవర్ ప్రాంతంలో నలు వైపులా ప్రత్యేకంగా వీధిదీపాలు బిగించగా ఆరు నెలల నుంచి వెలగడం లేదు. ఉన్న లైట్లు కింద పడిపోతున్నాయి. లైట్లు వంకరగా మారిన మరమ్మతులు చేసే వారు లేరు.

# పుట్నాల పప్పు ఆరోగ్యానికి ఎంత మంచిదంటే?

పుట్నాల పప్పుని చాలా మంది ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. ఇక పుట్నాల పప్పును అలాగే వీటితో చేసిన వంటకాలను తీసుకోవడం వల్ల మనం రుచితో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని మితంగా తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పుట్నాల పప్పును తినడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం.మనం ప్రతి రోజు ఈ పుట్నాల పప్పును తినడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అలాగే వీటిలో ఉండే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడతాయి. ఈ విధంగా పుట్నాల పప్పును తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటికి ఇతర మసాలాలు కలిపి మరింత రుచిగా తయారు చేసుకుని చిరుతిండి రూపంలో తీసుకోవడం వల్ల రుచితో పాటు పోషకాలను, చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. పుట్నాల పప్పులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది.వీటిని చిరుతిండి రూపంలో తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన ప్రోటీన్ లో ఎంతో కొంత అందించవచ్చు. అలాగే దీనిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. బరువు



తగ్గాలనుకునే వారికి ఇవి చక్కగా పనిచేస్తాయి. అలాగే వీటిలో కొవ్వు కూడా తక్కువగా ఉంటుంది. స్నాక్స్ తినాలనిపించినప్పుడు వీటిని తీసుకోవడం వల్ల మనం రుచితో పాటు ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా పుట్నాల పప్పును తీసుకోవడం వల్ల మన శరీరానికి తగినంత శక్తి లభిస్తుంది. మనం రోజంతా నీరసానికి గురి కాకుండా చక్కగా పని చేసుకోవచ్చు. అలాగే పుట్నాల పప్పులో ఫోలేట్, ఐరన్, ఫాస్పరస్, మాంగనీస్ వంటి మినరల్స్, విటమిన్స్ ఎక్కువగా ఉంటాయి.వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన విటమిన్స్,మినరల్స్ చక్కగా అందుతాయి.

# మీ శరీరానికి సరిపడా నీరు అందుతుందా.. ఇలా చెక్ చేసుకోండి!

తగినంత నీరు తాగడం వల్ల మీ దాహాన్ని తీర్చడం కంటే ఎక్కువే చేస్తుంది. మీ శరీరం ద్రవ సమతుల్యతను కాపాడుతుంది. కేలరీలను నియంత్రించడం, అవయవాలను సక్రమంగా పని చేయడం, శరీర ఉష్ణోగ్రతను నిర్వహించడం, టాక్సిన్‌లను తొలగించడం ఇలా చాలానే చేస్తుంది నీరు. ప్రతి రోజూ కనీసం ఎనిమిది 250 ఎమ్ఎల్ నీటిని అయినా తాగాలని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతి శరీరం భిన్నంగాఉంటుంది. కాబట్టి మీకు అవసరం అయిన హైడ్రేషన్ మీకు లభిస్తుందో లేదో మీకు ఎలా తెలుస్తుంది? తగినంత నీరు శరీరానికి అందుతుందో లేదో తెలుసుకోవడానికి ఈ టిప్స్ మీకు సహాయ పడతాయి. అవేంటో చూసేయండి. మీ శరీరానికి తగినంత నీరు సరిపోయిందా లేదా అనేది మీ మూత్రం రంగు బట్టి తెలుసుకోవచ్చు. ముదరు పసుపు లేదా కాషాయం రంగులు నిర్జలీకరణాన్ని సూచిస్తాయి. అయితే లేత పసుపు లేదా గడ్డి రంగులు బాగా హైడ్రేట్ శరీరాన్ని సూచిస్తాయి. కాబట్టి మీరు సరైన హైడ్రేషన్ స్థాయిలను స్థిరంగా నిర్వహిస్తున్నారా లేదా అని నిర్ధారించుకోవడానికి రోజంతా మీ మూత్రంపై నిఘా ఉంచండి. మీరు తరచుగా యూరిన్‌కి వెళ్తూ ఉంటే.. మీ శరీరం హైడ్రేట్‌గా ఉందని చెప్పొచ్చు. మీరు అరుదుగా మూత్రానికి వెళ్తూ ఉంటే.. తగినంత నీరు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పొచ్చు. చాలా మంది దాహం వేస్తేనే మంచి నీరు తాగుతారు. అలా కాకుండా.. గంటకు ఒక సారైనా నీటిని తాగుగూ ఉండటాన్ని అలవాటు చేసుకోండి. దీని వల్ల హైడ్రేట్‌గా ఉంటారు.



మీ శరీరానికి తగినంత నీరు అందుతుందో లేదో చెప్పేందుకు చర్మం కూడా సహాయ పడుతుంది. మీ చర్మం కాంతి వంతంగా ఉంటే మీరు హైడ్రేట్‌గా ఉన్నారని చెప్పొచ్చు. మీ చర్మం నిర్జీవంగా, డల్‌గా ఉంటే తగినంత నీరు తాగడం లేదని అనుకోవచ్చు. ఆకస్మిక బరువు మార్పులు కూడా మీ హైడ్రేషన్ స్టాయిల్లో హెచ్చుతగ్గులను సూచిస్తాయి. ఆహారం తీసుకోవడం, వ్యాయామం వంటి కారణాల వల్ల బరువు కొద్దిగా మారడం సాధారణమైనప్పటికీ ఆహారం లేదా కార్యాచరణలో మార్పు లేకుండా స్థిరమైన బరువు తగ్గడం నిర్జలీకరణాన్ని సూచిస్తుంది. అదే విధంగా వేగవంతమైన బరువు పెరగడం కూడా ద్రవం నిలుపుదలని సూచిస్తుంది. కాబట్టి ఒకసారి చెక్ చేసుకోండి.

## ఈ పండ్లు తిన్న తర్వాత


# నీరు తాగుతున్నారా.. అయితే జాగ్రత్త?



మామూలుగా వైద్యులు ఆరోగ్యంగా ఉండాలి అంటే తరచూ తాజా పండ్లను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. వీటి వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా వేసవికాలంలో ఎక్కువగా పండ్లను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. మరి ముఖ్యంగా నీటి శాతం ఎక్కువ కలిగిన పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. వీటివల్ల శరీరం తొందరగా డీహైడ్రేషన్ కాకుండా ఉంటుంది. అలాగే శరీరానికి కావాల్సిన ఫైబర్ విటమిన్లు కూడా అందుతాయి. అయితే పండ్లు తినడం మంచిదే కానీ పండ్లు తిన్న తర్వాత పొరపాటున కూడా నీటిని అస్సలు తాగకూడదు అనుకున్నారు వైద్యులు. మరి పండ్లు తిన్న తర్వాత నీళ్లు తాగితే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పండ్లలో హైడ్రేటింగ్ శక్తి విపరీతంగా ఉంటుంది. మీకు చాలా దాహం వేసినప్పుడు పండ్లు తిన్నా కూడా దాహం తీరుతుంది. మళ్లీ నీళ్లు తాగాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు పుచ్చకాయను తిన్నారనుకోండి. మీకు అస్సలు దాహమే వేయదు.. పండ్లు తిన్నాక దాహం తీరాక కూడా మళ్లీ నీళ్లు తాగితే శరీరంలో లేనిపోని సమస్యలు వస్తాయి. దాంతో ఏరి కోరి సమస్యలను తెచ్చుకున్నట్టే అవుతుంది. ఒకవేళ పండ్లు తిన్నాక కూడా విపరీతంగా దాహం వేస్తే, కనీసం 30 నిమిషాల పాటు వెయిట్ చేయాలి. ఆ తర్వాత దాహం తీర్చుకోవాలి. దాహం వేయకపోత కనీసం ఓ గంట సేపు ఆగి నీళ్లు తాగాలి. పండ్లు తినగానే అవి డైరెక్ట్ గా జీర్ణాశయంలోకి వెళ్తాయి. అక్కడ జీర్ణ ప్రక్రియ కోసం తిన్న పండ్లను అరిగించడం కోసం జీర్ణ వ్యవస్థ కొన్ని ఆమ్లాలను విడుదల చేస్తుంది. ఆ ఆమ్లాలు వెంటనే తిన్న పండ్లను జీర్ణం చేస్తాయి. ఒకవేళ మీరు పండ్లు తినగానే నీళ్లు తాగితే ఆ నీళ్లు విడుదలైన జీర్ణ ఎంజైమ్ లను పలుచన చేస్తాయి. దీంతో జీర్ణ వ్యవస్థ సరిగ్గా పనిచేయదు. తిన్న పండ్లు జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. దాన్ని జీర్ణం చేయడానికి జీర్ణ వ్యవస్థ ఎక్కువ సేపు కష్టపడాల్సి వస్తుంది. దాని వల్ల గ్యాస్ రావడం, కడుపులో మంట రావడం ఇతర సమస్యలు వస్తాయి. అలాగే తిన్న పండ్లు కూడా తొందరగా జీర్ణం కావు. పండ్లు తినగానే నీటిని తాగితే అతిసారం వస్తుంది. పండ్లలో ఎక్కువ నీరు ఉండటం, నీరు తాగగానే మరోసారి శరీరంలో నీటి కంటెంట్ ఎక్కువ అవుతుంది. దాని వల్ల పేగుల కదలికలు సులభతరం అయి అతిసారానికి దారి తీస్తుంది. అలాగే శరీరంలోని పీహెచ్ స్థాయిలు కూడా తగ్గిపోతాయి. పీహెచ్ స్థాయి ఆమ్లతను సూచిస్తుంది. పండ్లు తినగానే నీరు తాగితే పీహెచ్ స్థాయిలు కూడా పలుచన అవుతాయి. దాని వల్ల కూడా జీర్ణ సమస్యలు, కడుపు నొప్పి వస్తుంది. అందుకే.. పండ్లు తినగానే అస్సలు నీళ్లు తాగకూడదు.

## ఖాళీ కడుపుతో వెల్లుల్లి

# తింటే ఏమవుతుందో తెలుసా.?



వెల్లుల్లి ఆరోగ్యానికి ఎంతలా మేలు చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందులో ఎన్నో ఔషధగుణాలు ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. వెల్లుల్లిని ఆయుర్వేదంలో అనేక వ్యాధుల చికిత్సలో ఉపయోగిస్తారు. ఇందులోని యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్, ఐరన్, ఫాస్పరస్, కాల్షియం, ఫైబర్, కార్బోహైడ్రేట్, పొటాషియం, జింక్, కాపర్, థయామిన్, రైబోఫ్లావిన్ వంటి అనేక పోషకాలు శరీరాన్ని వ్యాధుల నుంచి దూరం చేస్తుంది. ఇక ఉదయాన్నే ఖాళీ కడుపుతో వెల్లుల్లి తీసుకుంటే లాభాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఉదయం పడగడుపున వెల్లుల్లి తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం.. పొట్ట ఆరోగ్యాన్ని కాపాడడంలో వెల్లుల్లి కీలక పాత్ర పోషిస్తుంది. ఖాళీ కడుపుతో వెల్లుల్లిని తీసుకోవడం వల్ల కాలేయం, మూత్రాశయం పనితీరు మెరుగవుతుంది. అతిసారం నుంచి ఉపశమనం లభిస్తుంది. మెరుగైన జీర్ణక్రియను అందించడంతో పాటు ఆకలిని పెంచుతుంది. వెల్లుల్లి ఒత్తిడిని నియంత్రించడంలో ఉపయోగపడుతుంది.

కడుపులో యాసిడ్ స్థాయిలు పెరగకుండా చూసుకుంటుంది. ఇక రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా వెల్లుల్లి కీలక పాత్ర పోషిస్తాయి. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల శరీరాన్ని అనేక రకాల వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. ఇది జలుబు, దగ్గు, జ్వరం లేదా ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడానికి ఉపయోగపడుతుంది. అధిక బీపీకి చెక్ పెట్టడంలో వెల్లల్లి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే పచ్చి వెల్లుల్లిని తీసుకోవడం వల్ల అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. వెల్లుల్లి సారం హై బీపీని తగ్గించడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల బీపీ లక్షణాలు తగ్గుతాయి. షుగర్ పేషెంట్స్‌కు కూడా వెల్లుల్లి దివ్యౌషధంగా ఉపయోగపడుతుంది. డయాబెటిక్ రోగులు పచ్చి వెల్లుల్లిని తీసుకుంటే, చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇందులోని అల్లిసిన్ సమ్మేళనం చక్కెరను నియంత్రిస్తుంది. ప్రతిరోజూ 3-4 వెల్లుల్లి రెబ్బలు నమిలి తింటే బరువు అదుపులో ఉంటుంది. వెల్లుల్లి శరీరాన్ని డిటాక్స్ చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. వెల్లుల్లిని క్రమంతప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ఎన్నో రకాల వ్యాధులు నయమవుతాయి. క్యాన్సర్, డయాబెటిస్, డిప్రెషన్ వంటి వాటిని దరిచేరనివ్వదు

## చెడు కొలెస్ట్రాల్ తగ్గాలంటే

# ఈ యోగా ఆసనాలను వేయాల్సిందే..!

ఈ రోజుల్లో చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ప్రజలు అధిక కొలెస్ట్రాల్ వంటి తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అనేక తీవ్రమైన వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని, దీని కారణంగా గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు పెరిగే ప్రమాదం ఉందని తెలిసిందే. జీవనశైలి, ఆహారపు అలవాట్లను మెరుగుపరచడం ద్వారా మీరు ఈ సమస్యను వదిలించుకోవచ్చు. కొన్ని యోగా ఆసనాలు కూడా ఉన్నాయి. ఇవి ఈ సమస్య నుండి బయటపడటానికి మీకు సహాయపడతాయి. ఈ రోజు మనం అటువంటి కొన్ని యోగాసనాల గురించి తెలుసుకుందాం. వీటిని ప్రతిరోజూ చేయడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గడం ప్రారంభమవుతుంది. గుండెపోటు, అధిక %బీపీ% సమస్య తొలగిపోతుంది. సూర్య నమస్కార్: ఈ యోగ ఆసనాల క్రమం రక్త ప్రసరణను పెంచుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ సమస్యను దూరం చేస్తుంది. అర్ధ మత్స్యేంద్రాసన: ఈ ఆసనం కాలేయాన్ని ఉత్తేజపరుస్తుంది. నిర్విషీకరణ ప్రక్రియలో సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. భుజంగాసనం: ఈ ఆసనం ఛాతీని విస్తరిస్తుంది. వెనుక కండరాలను బలపరుస్తుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ధనురాసనం: ఈ భంగిమ ఉదర అవయవాలను మసాజ్ చేస్తుంది. థైరాయిడ్ గ్రంధిని ప్రేరేపిస్తుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.



పశ్చిమోత్తానాసనం: ఈ ఆసనం హామ్ స్ట్రింగ్స్, దిగువ వీపును సాగదీయడానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి సహాయపడుతుంది. ఆహారం, జీవనశైలి చిట్కాలు యోగాను అభ్యసించడమే కాకుండా మీ ఆహారం, జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. దాని గురించి మరింత తెలుసుకోండి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోండి. వేయించిన ఆహారాలు, ప్రాసెస్ చేసిన స్నాక్స్, కొవ్వు మాంసాలు వంటి సంతృప్త, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉండే ఆహారాలకు దూరంగా ఉండండి. వాకింగ్, జాగింగ్ లేదా స్విమ్మింగ్ వంటి సాధారణ శారీరక శ్రమలో పాల్గొనండి. ధూమపానం మానేయండి. మద్యపానాన్ని పరిమితం చేయండి.

# అధికంగా కాఫీ తాగితే ఆరోగ్యానికి ప్రమాదం..

ఎక్కువ మొత్తంలో కాఫీ తీసుకోవడం వల్ల తలనొప్పి, ఆందోళన, దడపుట్టడం, ఆ తర్వాత క్రమంగా గుండెపోటుకు కూడా కారణం కావచ్చని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా రోజుకు ఆరు కప్పుల కాఫీ తాగితే.. మెదడుకు సంబంధించిన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాఫీ ఎక్కువగా తాగడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రోజుకు రెండు కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే హాని కలుగుతుంది. ఎక్కువ కాఫీ గుండెకు మంచిది కాదు. కాఫీ నాడీ వ్యవస్థను ఉత్తేజపరచడంతో పాటు గుండెపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. అడ్రినలిన్ స్థాయిలను పెంచి ఆందోళనను కలిగిస్తుంది. కాఫీ ఎక్కవ తాగడం వల్ల నిద్రలేమికి దారితీస్తుంది. కెఫిన్ ఉన్న కాఫీని తాగడం వల్ల మీ మానసిక ప్రశాంతతకు భంగం కలగడంతోపాటు.. జీవక్రియ, శారీరక పనితీరుపై దుష్ప్రభావం చూపుతుంది. చాలా మంది ఉదయాన్నే కప్పు కాఫీ తాగనది ఉండలేరు. అయితే.. కాఫీ ఉదయాన్నే తాగితే.. గ్యాస్ట్రిన్ విడుదలకు కారణమవుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కడుపులో ఉత్పత్తి చేసే హార్మోన్ వల్ల గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. జీర్ణాశయం, జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనివల్ల కడుపులో వికారం, గ్యాస్, మంట లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.ఎక్కువగా కాఫీ తీసుకోవడం వల్ల



రొమ్ములో చిన్న చిన్న గడ్డలు ఏర్పడే ప్రమాదం ఉంది. కాఫీ వల్ల శరీరంలో నీరు తగ్గుతుంది. ఇది ఆరోగ్యానికి, చర్మానికి, జుట్టుకు మంచిది కాదు. అధిక కెఫిన్ తీసుకోవడం వల్ల కలిగే ఉద్దీపన ప్రభావాలు మీ గుండెను వేగంగా కొట్టుకునేలా చేస్తాయి. దీనివల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. దీంతోపాటు కాఫీ నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపించి రక్తపోటును అమాంతం పెంచుతుంది. అందుకే గుండెపోటు, బీపీ ఉన్న వారు కాఫీకి దూరంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు వైద్య నిపుణులు..

# పచ్చిమిర్చి కారంగా ఉంటుందని పక్కన పెడుతున్నారా..



ప్రతిరోజు మనం ఉపయోగించే వంటల్లో పచ్చిమిరపకాయలను తప్పకుండా వేస్తూ ఉంటాం. ఇవి కూరకు రుచిని పెంచుతాయి. పచ్చి మిరపకాయలు కూరల్లో తినడానికి కానీ నేరుగా తినడానికి అస్సలు సాహసం చేయరు. పొరపాటున అవి తిన్నారంటే ఇక అంతే సంగతులు. బాబోయ్ పచ్చిమిరపకాయ మాకొద్దు అని అంటారు. కొందరు సమోసా, పెరుగన్నం వంటి వాటిలోకి పచ్చిమిరపకాయలను నంచుకుని తింటూ ఉంటారు. మీకు తెలుసా పచ్చిమిరపకాయ కారంగా ఉండటం మాత్రమే కాకుండా ఎన్నో రకాల ప్రయోజనాలను కూడా చేకూరుస్తుంది. అంతేకాకుండా పచ్చిమిర్చి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షిస్తుంది. పచ్చిమిర్చి వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చిమిరపలో ఎ ,సి ,బి6 విటమిన్లతో పాటు ఇనుము, రాగి, పొటాషియం తక్కువ మొత్తంలో ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి. పచ్చిమిరపలో క్యాప్సైసిన్ అనే పదార్థం శ్లేష్మ పొరలపై ప్రభావం చూపిస్తుంది.

దీంతో అది సులువుగా బయటకు వచ్చేస్తుంది. సైనస్, జలుబుకి పచ్చిమిరప మంచి సహాయకారిగా ఉపయోగపడుతుంది. పచ్చిమిరప రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది. కంటి ఆరోగ్యాన్ని చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పచ్చిమిరపలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. కోతలు, గాయాలు వంటి వాటిని త్వరగా నయం చేస్తుంది. గుండె జబ్బులు, అల్సర్లు కూడా పచ్చిమిరప తీసుకోవడం వల్ల నయమవుతాయట. రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ చేయడంలో ఇవి సమర్థవంతంగా పనిచేస్తాయి. డయాబెటీస్‌తో బాధపడుతున్నవారు స్పైసీ ఫుడ్ తినాలనుకుంటే పచ్చి మిరపకాయతో చేసిన ఫుడ్ తీసుకోవచ్చు.ముఖ్యంగా చలికాలంలో పచ్చిమిరపకాయలు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## నారింజ మంచిదని

# తెగ తింటున్నారా.?వీరికి చాలా డేంజర్..



చలికాలంలో ఎక్కువగా కనిపించే పండల్లో నారింజ ముందు వరుసలో ఉంటుంది. నారింజలో ఉండే ఎన్నో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా ఇందులోని విటమిన్ సీ శరీరానికి ఎంతగానో మేలు చేస్తుంది. అందుకే చలికాలంలో కచ్చితంగా నారింజను తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే ఇదంతా బాగానే ఉన్నా, కొందరు మాత్రం నారింజకు వీలైనంత దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు నారింజ పండును ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదని చెబుతున్నారు. ఇంతకీ నారింజ పండును ఏ వ్యక్తులు తినకుండా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం.. నిత్యం జలుబు, దగ్గుతో బాధపడే వారు నారింజకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. నారింజలో చలువ చేసే గుణాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జలుబు, దగ్గు ఉన్న వారికి వీటికి దూరంగా ఉండాలి. ఒకవేళ తీసుకుంటే జలుబు, దగ్గు మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. యాసిడిటీతో బాధపడే వారు ఆరెంజ్‌ను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. దీనికి కారణం నారింజలో ఆమ్లం కంటెంట్ ఎక్కువగా ఉంటుంది.

కాబట్టి యాసిడిటీతో బాధపడే వారు ఆరెంజ్ తీసుకోగానే కడుపులో యాసిడ్ స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. ఇది కడుపు నొప్పికి కారణమవుతుంది. పంటి సమస్యలతో బాధపడే వారు కూడా ఆరెంజ్‌ను తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దంతాలు బలహీనంగా ఉన్న వ్యక్తులు ఆరెంజ్‌కు దూరంగా ఉండాలి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**